'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 | RAJYA SAMSKARANA | తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 20 | శుక్రవారం | 4.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 20 | Friday | 4.9.2026 | Pages: 8 | Rate: 2

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# కొండా ఎపిసోడ్.. రేవంత్ పవర్ షో!

» తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత పోరు
» సురేఖపై వేటు.. అసలు టార్గెట్ ఇదే





తెలంగాణ కాంగ్రెస్‌లో చాలాకాలంగా సాగుతున్న అంతర్గత పోరు ఇప్పుడు బహిరంగ దశకు చేరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించడం ద్వారా తన రాజకీయ ఆధిపత్యాన్ని స్పష్టంగా చాటారు. సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్ రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబంపై చేసిన వ్యాఖ్యలే తాజా వివాదానికి కారణమయ్యాయి. కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయడం సరికాదని సురేఖ చెప్పినా పార్టీ క్రమశిక్షణ కమిటీ సంతృప్తి చెందలేదు. సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో పాటు ప్లానింగ్ బోర్డు నుంచి చిన్నారెడ్డిని తప్పించాలని కూడా కమిటీ సిఫారసు చేసినట్లు సమాచారం. ఢిల్లీ పర్యటనలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఈ అంశంపై చర్చించినట్లు తెలుస్తోంది. దీంతో ఇది కేవలం కుటుంబ వివాదం కాకుండా కాంగ్రెస్‌లోని అధికార పోరుకు ప్రతీకగా మారింది. (వివరాలు 2లో..)

## కూతురి వ్యాఖ్యలు.. మంత్రి పదవికి ఎసరు!

- కొండాపై చర్యకు అసలు కారణం ఇదేనా?
- చేయని తప్పుకు శిక్ష.. రేవంత్ కక్ష: సురేఖ

తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆమె కుమార్తె కొండా సుస్మిత చేసిన తీవ్ర వ్యాఖ్యలు చివరకు సురేఖ మంత్రి పదవికి ఎసరు పెట్టాయి. సుస్మిత వ్యాఖ్యలపై అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో సురేఖను వివరణ కోరారు. కుటుంబ సభ్యుల వ్యాఖ్యలకు రాజకీయ బాధ్యత ఎలా వహిస్తానంటూ సురేఖ ప్రశ్నించారు. తన కుమార్తె అభిప్రాయాలతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు కూడా తన వివరణను ఈమెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు.



2లో..

## బెదిరిస్తే భయపడను.. దోస్తీకే గులామ్!

### పాతబస్తీ వేదికగా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

పాతబస్తీ అభివృద్ధి కార్యక్రమం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఆసక్తి రేపాయి. చంచల్‌గూడ-సంతోష్‌నగర్ మధ్య నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన "బెదిరిస్తే భయపడను.. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్‌ను" అని వ్యాఖ్యానించారు. ఎన్నికలు వస్తుంటాయని, పోతుంటాయని, గెలుపోటములు సహజమని అన్నారు. గత ప్రభుత్వం ఫ్లైఓవర్‌కు కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయిందని, నిర్మాణానికి ఒక్క పైసా ఖర్చు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు పూర్తి చేసిందన్నారు. "ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ" అని రేవంత్ వ్యాఖ్యానిస్తూ పాతబస్తీలోని ప్రతి గల్లీ తనకు తెలుసన్నారు. అసదుద్దీన్ ఒవైసీ కోరిన అభివృద్ధి పనులను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. బలాల కళాశాల అభివృద్ధికి అడిగిన రూ.20 కోట్లకు బదులుగా రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నిధులు ప్రభుత్వం ఇస్తుందని, ఏడాదిన్నరలో పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేదేనని స్పష్టం చేశారు.




## మీసం మెలేసిన కొండా మురళీ



### పదవులు పోయినా ఆత్మగౌరవం పోలా

### సూటిగా మాట్లాడితే వేటేస్తారా?

కొండా సురేఖ బర్తరఫ్ నేపథ్యంలో కొండా మురళీ చేసిన తాజా ట్వీట్ తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీసింది. "ఇది కొత్తేమీ కాదు.. ఉన్నది ఉన్నట్టుగా సూటిగా మాట్లాడితే ఎవరూ తట్టుకోలేరు" అంటూ ఆయన తనదైన శైలిలో స్పందించారు. నేడు తమపై చర్యలు జరిగితే.. రేపు మరొకరి వంతు రావచ్చని వ్యాఖ్యానించారు. (వివరాలు 2లో..)

## సురేఖ బర్తరఫ్‌పై సుస్మిత ఫైర్

### అక్కడ్నుంచే సీఎం పోటీ చేయాలి
### తల్లికి అన్యాయం జరిగిందంటూ ఆగ్రహం



కొండా సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి రేవంత్‌రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా సంచలనంగా మారింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని, ఆమెపై వ్యవహరించిన తీరు తనను తీవ్రంగా బాధించిందని ఆమె అన్నారు. "మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు" అంటూ ఘాటుగా స్పందించారు. రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సుస్మిత.. తాను గతంలో చేసిన వ్యాఖ్యలు పార్టీకి వ్యతిరేకంగా చేసినవి కాదని, వ్యక్తిగతంగా ఒక వ్యక్తిని ఉద్దేశించి చేసినవేనని స్పష్టం చేశారు. తన తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోటీ చేయాలని సుస్మిత సవాల్ చేశారు. తన తల్లి రాజకీయంగా ఎదుర్కొంటున్న పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డిని శపిస్తున్నానంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి తీవ్ర దుమారం రేపాయి. (వివరాలు 2లో..)

## కొండా హిట్ వికెట్.. క్యాబినెట్ నుంచి ఔట్

6లో..

కాంగ్రెస్‌లో కొండా సురేఖ బర్తరఫ్ ఇప్పుడు సాధారణ రాజకీయ వివాదాన్ని దాటి పెద్ద అంతర్గత పోరుగా మారింది. కుమార్తె సుస్మిత చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను కారణంగా చూపి తనపై చర్య తీసుకోవడం అన్యాయమని సురేఖ మండిపడుతుండగా, హైకమాండ్ తన మాట వినకుండానే నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. అంతేకాదు, తనను తొలగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌పై ఒత్తిడి తెచ్చారని, తనపై రాజకీయ కుట్ర జరిగిందని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. శాఖల్లో జోక్యం, నియోజకవర్గ అభివృద్ధిలో వివక్ష, మాజీ ఓఎస్డీ సుమంత్ వ్యవహారం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు. కాంగ్రెస్‌ను వీడేది లేదని, ఎమ్మెల్యేగా కొనసాగుతానని చెబుతూ పార్టీ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తిని సర్వే చేయాలని సూచించారు. ఇదే సమయంలో సుస్మిత రంగంలోకి దిగి తల్లికి అండగా ఉంటానని చెబుతూ రేవంత్‌కు సవాల్ విసరడం వివాదాన్ని మరింత వేడెక్కించింది. సురేఖపై చర్యతో పాటు చిన్నారెడ్డిపై కూడా వేటు పడటం క్రమశిక్షణ అంశాన్ని ముందుకు తెచ్చింది. ఇప్పుడు అసలు ప్రశ్న ఒక్కటే.. ఈ లొల్లి ఇక్కడితో ఆగుతుందా? లేక రేవంత్ వర్సెస్ కొండా పోరు మరింత ముదిరి కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలను ప్రభావితం చేస్తుందా? కాంగ్రెస్‌లోనే ఉండి సురేఖ పోరాటం కొనసాగిస్తారా? మరికొందరు నేతలు ఆమెకు మద్దతుగా నిలుస్తారా? 2028 ఎన్నికల నాటికి ఈ విభేదాలు ఎలాంటి రాజకీయ సమీకరణాలకు దారితీస్తాయో చూడాలి. ఇదే ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌కు ఎదురైన అసలు రాజకీయ పరీక్ష.

## కొండా సురేఖ ఎఫెక్ట్

### ముగ్గురు బీసీ మహిళలకు పదవులు

తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ వివాదం కొనసాగుతున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం కీలక పదవుల్లో మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి జి. చిన్నారెడ్డిని తప్పించి హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అదేసమయంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారదకు అవకాశం కల్పించింది. ఈ రెండు నియామకాల్లోనూ బీసీ వర్గానికి చెందిన మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘారెడ్డిపై చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై కూడా విమర్శలు వచ్చాయి. కొండా సురేఖపై చర్యల సమయంలో ఆమె బీసీ అంశాన్ని ప్రస్తావించడంతో పరిస్థితి మరింత సున్నితంగా మారింది. ఢిల్లీలో జరిగిన చర్చల్లో సురేఖతో పాటు చిన్నారెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుబట్టినట్లు సమాచారం. హైకమాండ్ ఆమోదంతో ఇద్దరిపై చర్యలు తీసుకున్న తర్వాత, అదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ కొత్త నియామకాలు చేపట్టడం కీలక పరిణామంగా మారింది. (వివరాలు 2లో..)







3లో..

## టౌన్ ప్లానింగ్ అధికారి ఇంట్లో డబ్బే డబ్బు

### రూ.3.54 కోట్ల అక్రమ ఆస్తుల గుర్తింపు
### ఎనిమిది చోట్ల ఏకకాలంలో ఏసీబీ సోదాలు

సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి ఉయ్యాల సోమయ్యపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది.

## వెయ్యి రోజుల పాలనపై హరీశ్ రావు ఫైర్!

- గ్యారెంటీల నుంచి రైతు సమస్యల వరకు
- హామీలు ఎక్కడంటూ కాంగ్రెస్‌పై విమర్శలు



కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కౌడిపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఎన్నికలకు ముందు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా హామీలను పూర్తిగా నెరవేర్చలేదని ఆరోపించారు. (వివరాలు 2లో..)

## నాడు తండ్రి.. నేడు కొడుకు

### ఎడమ కాలువకు నీళ్లివ్వండి
### లేకుంటే పాదయాత్ర చేస్తా!
### రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్



నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రైతు ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2003లో నీళ్ల కోసం కేసీఆర్ కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేసిన కేటీఆర్.. సెప్టెంబర్ 14 వినాయక చవితిలోపు ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలకు స్పష్టమైన షెడ్యూల్ ఇవ్వకపోతే వేలాది మంది రైతులతో అదే మార్గంలో తాను పాదయాత్ర చేస్తానని హెచ్చరించారు. సాగర్‌లో నీరు ఉన్నా పంటలకు నీళ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. రెండు పంటలకు నీరు అందించిన గత పరిస్థితులను గుర్తుచేస్తూ రైతు డిక్లరేషన్, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతుభరోసా, రైతుబంధు, రైతుబీమా హామీల అమలుపై ప్రశ్నించారు. (2లో..)

## సురేఖ వేటు.. స్వయంకృతాపరాధం

### ఎన్ని అవకాశాలు ఇచ్చినా మారలేదు
### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టీకరణ



2లో..

కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం ఆమెకు ఎన్నో అవకాశాలు ఇచ్చినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో సురేఖ విఫలమయ్యారని ఆరోపించారు.



3లో..

## సీఈవోకే 'సర్' నోటీసులు!

### ఓటర్ల జాబితా సవరణలో ట్విస్ట్

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సి. సుదర్శన్ రెడ్డికి కూడా అధికారులు 'సర్' నోటీసులు జారీ చేశారు. 2002-2026 ఓటర్ల వివరాల్లో ఇంటిపేరు సరిపోలకపోవడంతో 'నేమ్ అనమాలీస్' కేటగిరీలో నోటీసులు వచ్చినట్లు తెలుస్తోంది.

## చిన్నారెడ్డి పెద్ద మాట



3లో..

### పదవి పోయినా గౌరవం దక్కుతోంది!
### వేటు తర్వాత పెద్దాయన హాట్ కామెంట్స్
### పదవిపై వ్యామోహం లేదంటూ కుండబద్దలు

తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగింపుపై కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల చిన్నారెడ్డి స్పందించారు. తనకు పదవులపై ఎలాంటి వ్యామోహం లేదని, పదవి ఉన్నా లేకపోయినా తన గౌరవం తనకు ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలవలేదని, కలవడానికి ప్రయత్నం కూడా చేయలేదని తెలిపారు. రాజకీయంగా కష్టపడి ఈ స్థాయికి చేరుకున్న తనను ఒక్క పోటుతో పదవి నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

## చిన్నారెడ్డిపై మాజీ ఎంపీ సంచలన పోస్ట్



3లో..

### కాంగ్రెస్ తీరును ఎండగట్టిన హర్షకుమార్

కాంగ్రెస్‌లో సీనియర్ నేత జి. చిన్నారెడ్డిని పదవి నుంచి తొలగించడంపై మాజీ ఎంపీ హర్ష కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1985లో టీడీపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేసిన ముఖ్య నాయకుల్లో చిన్నారెడ్డి ఒకరని, 1999లో కాంగ్రెస్ ఓడిపోయిన సమయంలో తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేచర్ ఫోరమ్‌కు నాయకత్వం వహించి తెలంగాణలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశారని ఆయన పేర్కొన్నారు.

## బీసీ మహిళ కాబట్టే వేటు వేశారా?

### సురేఖ బర్తరఫ్‌పై శ్రీనివాస్ గౌడ్ ఫైర్

కొండా సురేఖను తెలంగాణ కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు. బీసీ మహిళా నాయకురాలు కావడం వల్లే సురేఖను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరిత వైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. నారాయణపేట జిల్లా కోస్గిలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా నిర్వహించిన బీఆర్ఎస్ రైతు గర్జన సభలో ఆయన మాట్లాడారు.



2లో..

# కొండా ఎపిసోడ్.. రేవంత్ పవర్ షో!

- తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత పోరు
- సురేఖపై వేట.. అసలు టార్గెట్ ఇదే



**వెనక్కి తగ్గని కొండా సురేఖ**

మంత్రి పదవి కోల్పోయినా సురేఖ మాత్రం వెనక్కి తగ్గలేదు. తనకు ముందస్తు నోటీసు ఇవ్వకుండా నిర్ణయం తీసుకున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం తాను పదేళ్లుగా ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కుటుంబ సభ్యులు చేసిన వ్యాఖ్యలకు తన మంత్రి పదవిని ఎలా ముడిపెడతారని ప్రశ్నించారు. అధిష్ఠానం కనీసం తనతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సిందని అన్నారు. ఈ పరిణామం రేవంత్‌రెడ్డి కేబినెట్‌పై తన నియంత్రణను బలంగా చూపించింది. అదే సమయంలో పార్టీలోని అసమ్మతి వర్గాలకు కూడా స్పష్టమైన రాజకీయ సంకేతం వెళ్లింది. అయితే సురేఖ సామాజిక రాజకీయ నేపథ్యం ఈ వ్యవహారానికి మరో కోణాన్ని తెచ్చింది. ఆమె బీసీ మహిళా నేతగా వరంగల్ ప్రాంతంలో బలమైన రాజకీయ ప్రాతినిధ్యం కలిగి ఉండటంతో ఆ వర్గాల్లో అసంతృప్తి రాకుండా రేవంత్ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపిస్తోంది. వరంగల్ ప్రాంతానికి చెందిన ముగ్గురు బీసీ మహిళలకు కీలక పదవులు ఇవ్వడం కూడా ఇదే రాజకీయ సమతుల్యతలో భాగంగా కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్ విమర్శలు**

కొండా సురేఖపై చర్యతో తెలంగాణ కాంగ్రెస్‌లో అసలు పోరు మరింత స్పష్టమైంది. ఒకవైపు పార్టీకి పాతకాలం నుంచి ఉన్న సీనియర్ నేతలు, మరోవైపు రేవంత్‌రెడ్డి చుట్టూ బలపడుతున్న కొత్త రాజకీయ సమీకరణం కనిపిస్తోంది. భేదాభిప్రాయాలు ఇక వ్యక్తిగత వ్యాఖ్యల స్థాయిని దాటి పార్టీపై పట్టు, భవిష్యత్ నాయకత్వం, రాజకీయ ప్రభావం కోసం పోరుగా మారుతున్నాయి. భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ వంటి సీనియర్ నేతలతో పాటు రేవంత్ వర్గంగా భావిస్తున్న కొత్త నాయకుల మధ్య ఈ అంతర్గత సమీకరణాలు ఆసక్తి రేపుతున్నాయి. ఇటీవల కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా కొత్తవాళ్లు వచ్చి పాతవాళ్లను బయటకు పంపే ప్రయత్నాలు మంచిది కాదంటూ హెచ్చరించడం ఈ ఉద్రిక్తతకు మరో ఉదాహరణ. సురేఖను తొలగించడం ద్వారా రేవంత్ తన కేబినెట్‌పై పూర్తి పట్టు చూపించారు. ఇప్పుడు ఈ పరిణామం మిగిలిన అసమ్మతి నేతలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నదే తెలంగాణ కాంగ్రెస్‌లో అసలు చర్చ.

## కూతురి వ్యాఖ్యలు.. మంత్రి పదవికి ఎసరు!

- కొండాపై చర్యకు అసలు కారణం ఇదేనా?
- చేయని తప్పుకు శిక్ష.. రేవంత్ కక్ష: సురేఖ

**పరకాల టికెట్ చిచ్చు**

వివాదానికి కేంద్రంగా నిలిచింది పరకాల అసెంబ్లీ నియోజకవర్గం. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి మద్దతు ఇవ్వడంపై సుస్మిత తీవ్రంగా స్పందించారు. తాను స్వతంత్రంగా పోటీ చేసినా గెలుస్తానని సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డిని అహంకారిగా అభివర్ణిస్తూ టికెట్ ఎవరికి ఇవ్వాలో ఆయన ఎలా నిర్ణయిస్తారంటూ ప్రశ్నించారు. వెంటనే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయి. పార్టీ క్రమశిక్షణ కమిటీ సురేఖపై చర్యలకు సిఫారసు చేసిన నేపథ్యంలో పరిస్థితి మరింత ముదిరింది.

**బర్తరఫ్‌పై సురేఖ ఎదురుదాడి**

చివరకు గురువారం సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించారు. దీనిపై స్పందించిన ఆమె తనపై కక్ష సాధింపు చర్య జరిగిందని ఆరోపించారు. గతంలో ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వంటి కాంగ్రెస్ అగ్రనేతలపై తీవ్ర విమర్శలు చేసిన కొందరు నాయకులు పదవుల్లో కొనసాగారని గుర్తుచేశారు. తన కుమార్తె మాటలను అడ్డుపెట్టుకుని తనపై చర్యలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారని కూడా ఆరోపించారు. అయితే సురేఖ మాత్రం కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దాదాపు 30 ఏళ్లుగా కాంగ్రెస్‌లోనే ఉన్నానని, చివరి వరకు పార్టీలోనే కొనసాగుతానని తేల్చిచెప్పారు. దీంతో కొండా కుటుంబం, రేవంత్‌రెడ్డి మధ్య రాజకీయ విభేదాలు ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో మరో కీలక అంతర్గత సంక్షోభంగా మారాయి.



## మీసం మెలేసిన కొండా మురళీ

కొండా సురేఖ బర్తరఫ్ నేపథ్యంలో కొండా మురళీ చేసిన తాజా ట్వీట్ తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీసింది. "ఇది కొత్తేమీ కాదు.. ఉన్నది ఉన్నట్టుగా సూటిగా మాట్లాడితే ఎవరూ తట్టుకోలేరు" అంటూ ఆయన తనదైన శైలిలో స్పందించారు. నేడు తమపై చర్యలు జరిగితే.. రేపు మరొకరి వంతు రావచ్చని వ్యాఖ్యానించారు. పదవులు ఉన్నా లేకపోయినా ఆత్మగౌరవం మాత్రం తమతోనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి విషయానికీ వెంటనే స్పందించకపోయినా.. జరుగుతున్న ప్రతి పరిణామాన్ని గమనిస్తున్నామని కొండా మురళీ పేర్కొన్నారు. తమపై జరుగుతున్న రాజకీయ దాడులను ఎదుర్కొనేందుకు వెనక్కి తగ్గబోమని సంకేతం ఇచ్చారు. అందరూ కలిసి తమపై రాజకీయ దాడులు చేస్తున్నా.. ధైర్యంగా నిలబడి, పట్టుదలతో ఎదుర్కొంటామని ఆయన ట్వీట్‌లో స్పష్టం చేశారు. మరోవైపు సురేఖ ప్రెస్‌మీట్‌కు బాల్కనీలో కన్పించిన మురళీ మీసం మెలేస్తూ కన్పించాడు. సురేఖ మంత్రి పదవి కోల్పోయిన కొద్దిసేపటికే మురళీ చేసిన ఈ వ్యాఖ్యలు కీలకంగా మారాయి. ఈ ట్వీట్ ద్వారా కొండా కుటుంబం రాజకీయంగా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్న సంకేతం ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## కొండా సురేఖ ఎఫెక్ట్

### ముగ్గురు బీసీ మహిళలకు పదవులు

సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘారెడ్డిపై చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై కూడా విమర్శలు వచ్చాయి. కొండా సురేఖపై చర్యల సమయంలో ఆమె బీసీ అంశాన్ని ప్రస్తావించడంతో పరిస్థితి మరింత సున్నితంగా మారింది. ఢిల్లీలో జరిగిన చర్చల్లో సురేఖతో పాటు చిన్నారెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుబట్టినట్లు సమాచారం. హైకమాండ్ ఆమోదంతో ఇద్దరిపై చర్యలు తీసుకున్న తర్వాత, అదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ కొత్త నియామకాలు చేపట్టడం కీలక పరిణామంగా మారింది.

**సురేఖ స్థానంలో బీసీ మహిళకు చాన్స్**

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణికి కీలక బాధ్యతలు అప్పగించారు. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణిని నియమించారు. దీంతో వరంగల్ ప్రాంతంలో సురేఖ తొలగింపుతో ఏర్పడే రాజకీయ అసంతృప్తిని సమతుల్యం చేసే ప్రయత్నంగా ఈ నియామకాన్ని చూస్తున్నారు. మరోవైపు సురేఖ స్థానంలో కేబినెట్‌లోకి కూడా బీసీ వర్గానికి చెందిన మహిళను తీసుకునే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. ఆ అవకాశం ఎవరికి దక్కుతుందన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర అంశంగా మారింది. మొత్తంగా సురేఖ, చిన్నారెడ్డి స్థానాల్లో మార్పులు చేయడంతో పాటు బీసీ మహిళలకు కీలక పదవులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ఒకేసారి రాజకీయ సమతుల్యత సాధించే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది.







## సురేఖ బర్తరఫ్‌పై సుస్మిత ఫైర్

- అక్కడ్నుంచే సీఎం పోటీ చేయాలి
- తల్లికి అన్యాయం జరిగిందంటూ ఆగ్రహం

ఇదే సమయంలో రేవంత్‌రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. తన తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోటీ చేయాలని సుస్మిత సవాల్ చేశారు. తన తల్లి రాజకీయంగా ఎదుర్కొంటున్న పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డిని శపిస్తున్నానంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి తీవ్ర దుమారం రేపాయి.

**భూవివాదం నుంచి మొదలైన రాజకీయ దుమారం**

ఈ వివాదానికి ప్రధాన కారణం సుస్మిత చేసిన ఆరోపణలే. రేవంత్‌రెడ్డి సోదరుడికి సంబంధించిన షెల్ కంపెనీకి విలువైన భూములను తక్కువ ధరకు కేటాయించారని ఆమె ఆరోపించారు. దీంతో కాంగ్రెస్‌లో తీవ్ర రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. మరోవైపు టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు పరిస్థితిని మరింత వేడెక్కించాయి. ఈ పరిణామాలపై కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని చర్యలకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేస్తూ గవర్నర్‌కు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని సురేఖ స్పష్టం చేసినా బర్తరఫ్ తప్పలేదు. ఇప్పుడు సుస్మిత చేసిన పరకాల సవాల్ తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరతీసింది.



## బెదిరిస్తే భయపడను.. దోస్తీకే గులామ్!

- బెదిరింపులకు భయపడను.. స్నేహంతో గెలవాలి
- పాతబస్తీ వేదికగా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**మెట్రో నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు భారీ హామీలు**

హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం పలు కీలక ప్రకటనలు చేశారు. మీరాలం చెరువులో 3 కిలోమీటర్ల కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తామని, వచ్చే ఎన్నికల్లోగా గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో పూర్తి చేస్తామని చెప్పారు. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్, వనస్థలిపురం, రాజేంద్రనగర్, శంషాబాద్ వరకు మెట్రో విస్తరణ చేపడతామన్నారు. హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. విద్య కోసం ఎంతైనా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఒవైసీ దేశానికి మద్దతుగా నిలిచారని ప్రశంసించారు. రాజకీయ సిద్ధాంతాలు వేరైనా దేశభక్తి విషయంలో అందరూ ఒక్కటేనన్నారు. హిందూ, ముస్లింలు కలిసి నడిస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపిస్తూ, మూసీ రివర్‌ఫ్రంట్‌తో నైట్ ఎకానమీని ప్రోత్సహించి పేద ముస్లింలకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసిన తర్వాత అభివృద్ధే లక్ష్యమని రేవంత్ స్పష్టం చేస్తూ హైదరాబాద్‌ను కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.



## బీసీ మహిళ కాబట్టే వేటు వేశారా?

### సురేఖ బర్తరఫ్‌పై శ్రీనివాస్ గౌడ్ ఫైర్



కొండా సురేఖను తెలంగాణ కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయడంపై బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు. బీసీ మహిళా నాయకురాలు కావడం వల్లే సురేఖను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరిత వైఖరితో వ్యవహరిస్తోందని విమర్శించారు. నారాయణపేట జిల్లా కోస్గిలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా నిర్వహించిన బీఆర్‌ఎస్ రైతు గర్జన సభలో ఆయన మాట్లాడారు. ఈ సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి పాల్గొన్న శ్రీనివాస్ గౌడ్.. కాంగ్రెస్‌లో పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నా వారిపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. కేవలం సురేఖ విషయంలోనే కఠిన చర్యలు తీసుకోవడం వెనుక కారణమేంటని నిలదీశారు. సొంత పార్టీ నేతలకు ఒక న్యాయం, సురేఖకు మరో న్యాయమా అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రశ్నించారు.

**అవినీతి ఆరోపణలపై చర్యలు ఏవి?**

ప్రస్తుత కేబినెట్‌లోని కొందరు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. అలాంటి ఆరోపణలపై చర్యలు తీసుకోకుండా సురేఖను మాత్రమే పదవి నుంచి తొలగించడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలను వివిధ విధాలుగా మోసం చేస్తోందని ఆరోపించారు. పదవుల తొలగింపులో కూడా బడుగు, బలహీన వర్గాలకు చెందిన నేతలనే బలిపశువులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. సురేఖ బర్తరఫ్ కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారమే అయినప్పటికీ, ఒక బలమైన బీసీ మహిళా నాయకురాలికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దీంతో సురేఖ ఉద్వాసన చుట్టూ ఇప్పటికే కొనసాగుతున్న రాజకీయ వివాదానికి బీసీ కోణం కూడా చేరింది.

## వెయ్యి రోజుల పాలనపై హరీశ్ రావు ఫైర్!



కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కౌడిపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఎన్నికలకు ముందు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా హామీలను పూర్తిగా నెరవేర్చలేదని ఆరోపించారు. రూ.4 వేల పెన్షన్, రూ.15 వేల రైతుబంధు, మహిళలకు నెలకు రూ.2,500, రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు భరోసా కార్డులు, ఆడపిల్లలకు స్కూటీల హామీలను ప్రస్తావించారు. రైతుబీమా నిలిచిపోయిందని, రైతుబంధు నిధులు అందడం లేదని విమర్శించారు. 24 గంటల విద్యుత్ స్థానంలో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎరువుల ధరలు పెరిగాయని, పంటల కొనుగోళ్లలో సమస్యలు ఉన్నాయని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయని, బసవేశ్వర, సంగమేశ్వర, ఘనపూర్ ఆనకట్ట, నర్సాపూర్-మెదక్ కాలువ పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

**రుణమాఫీపై సీఎంకు సవాల్**

కౌడిపల్లిలో సగానికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని హరీశ్‌రావు ఆరోపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నేరుగా సవాల్ విసిరారు. పోలీసుల భద్రత లేకుండా కౌడిపల్లికి వచ్చి అందరికీ రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని, జరగలేదని తేలితే సీఎం రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీకి వెళ్తున్నారని, రాష్ట్రానికి మాత్రం ప్రయోజనం కనిపించడం లేదని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మహాలక్ష్మి, పెన్షన్లు, ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మరోవైపు కౌడిపల్లి పీఏసీఎస్‌లో వడ్లు కొనకుండానే కోటి రూపాయల అక్రమాలు జరిగాయని, మహమ్మద్‌నగర్ పీఏసీఎస్‌లోనూ అవకతవకలు ఉన్నాయని ఆరోపించారు. చేయని తప్పుకు కంప్యూటర్ ఆపరేటర్ అర్షద్‌ను బలిచేసి, అవమానం తట్టుకోలేక అతడు ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఎస్పీ వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల భూములను 22ఏ నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల రైతులకు బంధు, బీమా, భూముల విక్రయాల్లో ఇబ్బందులు వస్తున్నాయని ఆరోపిస్తూ, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఓడిస్తారని హరీశ్‌రావు అన్నారు.

## నాడు తండ్రి..నేడు కొడుకు

- ఎడమ కాలువకు నీళ్లివ్వండి
- లేకుంటే పాదయాత్ర చేస్తా!
- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్



నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రైతు ధర్నాలో పాల్గొన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 2003లో నీళ్ల కోసం కేసీఆర్ కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేసిన కేటీఆర్.. సెప్టెంబర్ 14 వినాయక చవితిలోపు ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలకు స్పష్టమైన షెడ్యూల్ ఇవ్వకపోతే వేలాది మంది రైతులతో అదే మార్గంలో తాను పాదయాత్ర చేస్తానని హెచ్చరించారు. సాగర్‌లో నీరు ఉన్నా పంటలకు నీళ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. రెండు పంటలకు నీరు అందించిన గత పరిస్థితులను గుర్తుచేస్తూ రైతు డిక్లరేషన్, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతుభరోసా, రైతుబంధు, రైతుబీమా హామీల అమలుపై ప్రశ్నించారు. ఎడమ కాలువ రైతులు కాంగ్రెస్‌కు ఓటు వేయడమే తప్పయిందా అని నిలదీశారు. పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని, రైతులకు యూరియా కూడా దొరకడం లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పాలిటెక్నిక్ విద్యార్థులకు కేటీఆర్ భరోసా**

మరోవైపు పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపైనా కేటీఆర్ స్పందించారు. మిర్యాలగూడకు వెళ్తున్న సమయంలో ఎంజీ యూనివర్సిటీ వద్ద విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. పాలిటెక్నిక్ కళాశాలల భూములు, విద్యాసంస్థల భవిష్యత్తు, సాంకేతిక విద్యకు సంబంధించిన అంశాలను విద్యార్థులు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యలను అత్యంత ప్రాధాన్యంతో ప్రస్తావిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇచ్చే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల విలువైన భూములపై ప్రభుత్వ వైఖరిపై విద్యార్థుల్లో ఉన్న ఆందోళనను కూడా ప్రస్తావించారు. సాంకేతిక విద్యను బలోపేతం చేయాలని, జర్మనీ తరహాలో చదువుతోపాటు పని అనుభవం కల్పించే డ్యూయల్ ప్రోగ్రామ్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు, ప్రాక్టీస్ స్కూల్స్ వంటి విధానాలను పరిశీలించాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి తరఫున అసెంబ్లీలో బీఆర్‌ఎస్ గట్టిగా పోరాడుతుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## సురేఖ వేటు.. స్వయంకృతాపరాధం



కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం ఆమెకు ఎన్నో అవకాశాలు ఇచ్చినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో సురేఖ విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సురేఖ, ఆమె కుటుంబ సభ్యులు పదేపదే బహిరంగంగా తీవ్ర విమర్శలు చేసినా వారిని నియంత్రించలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలో కూడా స్పందించకపోవడం సురేఖ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించినందుకే ఈ పరిస్థితి వచ్చిందని స్పష్టం చేశారు.

**అధిష్ఠానం నిర్ణయమే.. బ్లాక్‌మెయిల్ కాదు**

సురేఖపై చర్య విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం పూర్తి స్థాయిలో పరిస్థితిని పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుందని ఆది శ్రీనివాస్ తెలిపారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వంటి అగ్రనేతల పరిశీలన తర్వాతే చర్యలు జరిగాయని చెప్పారు. అధిష్ఠానాన్ని రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేశారన్న సురేఖ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఇదే సమయంలో ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించిన జి. చిన్నారెడ్డి అంశాన్ని కూడా ప్రస్తావించారు. చిన్నారెడ్డి పట్ల రేవంత్‌రెడ్డికి ఎంతో గౌరవం ఉందని, గతంలో ఆయన గెలుపు కోసం సీఎం పనిచేశారని గుర్తుచేశారు. అయినా పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపరిచేలా వ్యవహరిస్తే ఎంతటి సీనియర్ నేతలైనా ఉపేక్షించబోమని అధిష్ఠానం స్పష్టం చేసిందన్నారు. తాజా చర్యలు వ్యక్తిగత కక్షతో కాకుండా పార్టీ క్రమశిక్షణను కాపాడేందుకే తీసుకున్న కఠిన నిర్ణయాలని ఆది శ్రీనివాస్ తేల్చిచెప్పారు.



# బార్ కౌన్సిల్‌కు అంత సీన్ లేదు

- విద్యార్థులను శిక్షించే అధికారం లేదు
- లా విద్యార్థులపై బీసీఐ పవర్‌పై స్పష్టత
- మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

లా విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అడ్వకేట్స్ యాక్ట్-1961 కింద బీసీఐకి ఉన్న క్రమశిక్షణాధికారాలు కేవలం నమోదైన న్యాయవాదులకే పరిమితమని తేల్చిచెప్పింది. నల్సార్ లా యూనివర్సిటీకి చెందిన ఇద్దరు మాజీ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ కీలక తీర్పు వెలువడింది. 2026 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవానికి సీజేఐని ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. దీనిపై బీసీఐ నల్సార్ యాజమాన్యాన్ని విచారణకు ఆదేశిస్తూ లేఖలు పంపింది. విద్యార్థులను అడ్వకేట్లుగా ప్రొఫెషనల్ ఎన్‌రోల్‌మెంట్‌కు అనుమతించకుండా రాష్ట్ర బార్ కౌన్సిళ్లను ఆదేశించే ప్రయత్నం కూడా చేసింది. ఈ చర్యలు విద్యార్థుల భావ ప్రకటన స్వేచ్ఛ, సంఘటితమయ్యే హక్కుపై భయపెట్టే ప్రభావం చూపుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

### వెనక్కి తీసుకున్న లేఖలు.. ముగిసిన వివాదం

విచారణ సందర్భంగా బీసీఐ చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా కోర్టుకు హాజరై కీలక వివరణ ఇచ్చారు. నల్సార్ విద్యార్థులపై విచారణకు ఆదేశించిన లేఖలను, విద్యార్థులను ఎన్‌రోల్‌మెంట్ నుంచి అడ్డుకోవాలని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు పంపిన లేఖలను వెంటనే ఉపసంహరించుకున్నామని తెలిపారు. దీంతో ఇక తదుపరి చర్య అవసరం లేదని ఆయన కోర్టుకు వెల్లడించారు. ఈ లేఖలు ప్రస్తుతం అమల్లో లేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బీసీఐ అధికార పరిధిపై కోర్టు ఇచ్చిన స్పష్టత దేశవ్యాప్తంగా లా విద్యార్థుల హక్కులకు ప్రాధాన్యతనిచ్చే కీలక నిర్ణయంగా మారింది. లా విద్యార్థులపై శిక్షాత్మక చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని అత్యున్నత న్యాయస్థానం తేల్చడంతో విద్యార్థుల స్వేచ్ఛ, విద్యాసంస్థల స్వయం ప్రతిపత్తిపై చర్చకు తెరలేచింది.



# సీఈవోకే 'సర్' నోటీసులు!

- ఓటర్ల జాబితా సవరణలో ట్విస్ట్

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సి. సుదర్శన్ రెడ్డికి కూడా అధికారులు 'సర్' నోటీసులు జారీ చేశారు. 2002-2026 ఓటర్ల వివరాల్లో ఇంటిపేరు సరిపోలకపోవడంతో 'నేమ్ అనమాలీస్' కేటగిరీలో నోటీసులు వచ్చినట్లు తెలుస్తోంది. నోటీసు అందుకున్న సుదర్శన్ రెడ్డి ఎన్నికల అధికారులకు అవసరమైన వివరాలు సమర్పించనున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా సర్ నోటీసుల వ్యవహారం ఓటర్లలో ఆందోళనకు కారణమవుతోంది. ఇప్పటికే దాదాపు 93 లక్షల మందికి నోటీసులు అందినట్లు సమాచారం. ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి వివరాలతో సమర్పించినప్పటికీ నోటీసులు రావడంతో చాలామంది అయోమయానికి గురవుతున్నారు.

- చిన్న తప్పులకే నోటీసులా?

నో మ్యాపింగ్, నేమ్ అనమాలీస్ కారణంగా హైదరాబాద్‌లో సుమారు 12.55 లక్షల మంది ఓటర్లు ఈ కేటగిరీల్లో ఉన్నట్లు సమాచారం. వీరందరికీ నోటీసులు జారీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు దాదాపు లక్ష మందికి మాత్రమే అందినట్లు తెలుస్తోంది. ఓటరు పేరు, తండ్రి పేరు, ఇంటిపేరు, చిరునామాలో చిన్నపాటి అక్షర దోషం ఉన్నా విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇవ్వడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా SIR ప్రక్రియ గడువును మరో మూడు వారాలు పొడిగించే అవకాశం ఉంది. ప్రస్తుతం సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అక్టోబర్ 15 వరకు నోటీసుల విచారణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది జాబితా ప్రకటించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం గడువు పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. నోటీసుల విచారణను వేగవంతం చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశిస్తూ, ఆధారాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



# సచివాలయాల్లో సేవలు మెరుగుపడాలి

- ప్రజలతో మర్యాదగా మెలగాలి..
- కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్

ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలంటే వార్డు సచివాలయాల సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ప్రొద్దుటూరు మున్సిపల్ కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సూచించారు. స్వరాజ్యనగర్ పరిధిలోని 7, 8 వార్డు సచివాలయాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన.. అక్కడికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి సేవలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈకేవైసీ, పిల్లల ఆధార్, తల్లి-పిల్లల మ్యాపింగ్, మనమిత్ర ట్రైనింగ్‌పై వివరాలు తెలుసుకున్నారు. అన్ని వార్డు సచివాలయాల్లో ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా పనిచేయాలని, సేవల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని కమీషనర్ స్పష్టం చేశారు.

# చిన్నారెడ్డి పెద్ద మాట

- పదవి పోయినా గౌరవం దక్కుతోంది!
- వేటు తర్వాత పెద్దాయన హాట్ కామెంట్స్
- పదవిపై వ్యామోహం లేదంటూ కుండబద్ధలు

తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగింపుపై కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల చిన్నారెడ్డి స్పందించారు. తనకు పదవులపై ఎలాంటి వ్యామోహం లేదని, పదవి ఉన్నా లేకపోయినా తన గౌరవం తనకు ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలవలేదని, కలవడానికి ప్రయత్నం కూడా చేయలేదని తెలిపారు. రాజకీయంగా కష్టపడి ఈ స్థాయికి చేరుకున్న తనను ఒక్క పోటుతో పదవి నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎవరిపైనా వ్యక్తిగత విమర్శలు చేయలేదని, కార్యకర్తలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు, అంశాలనే ప్రస్తావించానని వివరించారు. తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తన వైఖరిని స్పష్టం చేసిన చిన్నారెడ్డి.. తన మాటలను వక్రీకరించాల్సిన అవసరం లేదని పరోక్షంగా సూచించారు.



### కార్యకర్తల ఆవేదనతోనే మాట్లాడా

తన వర్గీయులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రావద్దని, వస్తే మెడలు పట్టి బయటకు పంపిస్తానని ఎమ్మెల్యే హెచ్చరిస్తున్నారంటూ కార్యకర్తలు తన వద్ద ఆవేదన వ్యక్తం చేశారని చిన్నారెడ్డి తెలిపారు. కార్యకర్తలు చెప్పిన విషయాల నేపథ్యంలోనే తాను ఆ అంశాన్ని ప్రస్తావించానని ఆయన వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యల వెనుక వ్యక్తిగత కక్ష లేదా ఎవరినైనా లక్ష్యంగా చేసుకునే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. పదవి కోల్పోయిన తర్వాత తన భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. దీంతో చిన్నారెడ్డి తదుపరి అడుగు ఏంటన్నదానిపై కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పదవి పోయినా రాజకీయంగా వెనక్కి తగ్గేది లేదన్న సంకేతాన్ని ఆయన తాజా వ్యాఖ్యలు ఇస్తున్నాయి. మరోవైపు సురేఖ వ్యవహారం తర్వాత చిన్నారెడ్డిపై కూడా చర్యలు రావడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై చర్చ మరింత పెరిగింది.

## చిన్నారెడ్డిపై మాజీ ఎంపీ సంచలన పోస్ట్

- కాంగ్రెస్ తీరును ఎండగట్టిన హర్షకుమార్

కాంగ్రెస్‌లో సీనియర్ నేత జి. చిన్నారెడ్డిని పదవి నుంచి తొలగించడంపై మాజీ ఎంపీ హర్ష కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1985లో టీడీపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేసిన ముఖ్య నాయకుల్లో చిన్నారెడ్డి ఒకరని, 1999లో కాంగ్రెస్ ఓడిపోయిన సమయంలో తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేచర్ ఫోరమ్‌కు నాయకత్వం వహించి తెలంగాణలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 1999లో పీసీసీ అధ్యక్షుడిగా ఆంధ్రలో విజయం సాధించినా, తెలంగాణ పరిణామాల కారణంగా ముఖ్యమంత్రి కాలేకపోయారని హర్ష కుమార్ అన్నారు. అలాంటి నేపథ్యం ఉన్న చిన్నారెడ్డిని తప్పించి, గతంలో పదేళ్లపాటు టీఆర్ఎస్/బీఆర్ఎస్‌లో కొనసాగిన నేత కే. కేశవరావు కుమార్తెకు అవకాశం కల్పించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. కేశవరావు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా, ఎంపీగా కాంగ్రెస్‌లో కొనసాగి, అధికార మార్పు సమయంలో టీఆర్ఎస్‌లోకి వెళ్లారని హర్ష కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ పాత నేతలను క్రమంగా పక్కకు పంపుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, హైకమాండ్ నిర్ణయాలను జాగ్రత్తగా పరిశీలించకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని మాజీ ఎంపీ హర్ష కుమార్ హెచ్చరించారు.

# గోదావరి కాలుష్యంపై పవన్ కీలక ఆదేశాలు

- డ్రెయిన్లపై నిఘా.. వ్యర్థాలపై శాస్త్రీయ అధ్యయనం



గోదావరి పుష్కరాలను 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' థీమ్‌తో నిర్వహించేందుకు సిద్ధమవుతున్న వేళ.. నది కాలుష్యంపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. గోదావరిలోకి డ్రెయిన్ల ద్వారా చేరుతున్న మురుగు, పారిశ్రామిక వ్యర్థాలపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం నుంచి అంతర్వేది వరకు నదిలో కలిసే అన్ని ప్రధాన, ఉప డ్రెయిన్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర గోదావరి పరివాహక ప్రాంతంలో సుమారు 15 ప్రధాన, 45 మైనర్ డ్రెయిన్లు నదిలో కలుస్తున్న నేపథ్యంలో వాటి ద్వారా చేరుతున్న వ్యర్థాలపై శాస్త్రీయ విశ్లేషణ చేయాలని స్పష్టం చేశారు. యనమదుర్రు డ్రెయిన్ ద్వారా పారిశ్రామిక వ్యర్థాలు వశిష్ట గోదావరిలోకి చేరడం, రామచంద్రపురం మురుగు టేకి మేజర్ డ్రెయిన్ ద్వారా, అమలాపురం వ్యర్థాలు కుమ్మర కాలువ ద్వారా, ధవళేశ్వరం పరిసర వ్యర్థాలు గోరింకల డ్రెయిన్ ద్వారా నదిలో కలుస్తున్న అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. పట్టణ మురుగుతోపాటు గోదావరి తీరంలోని 262 గ్రామ పంచాయతీల వ్యర్థాలు నదిలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### నమూనాల పరీక్ష.. తప్పిదాలపై కఠిన చర్యలు

ప్రతి డ్రెయిన్ నుంచి క్రమం తప్పకుండా నీటి నమూనాలు సేకరించి BOD, COD, ఘన వ్యర్థాలు, భారీ లోహాలు, హానికారక రసాయనాల స్థాయిని పరీక్షించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పారిశ్రామిక వ్యర్థ జలాలు నిబంధనల ప్రకారం శుద్ధి అవుతున్నాయా లేదా అన్నది ప్రత్యేకంగా పరిశీలించాలని, గోదావరిలో కలిసే ముందు ప్రతి వ్యర్థ జలానికి అవసరమైన శుద్ధి తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. పరిమితికి మించిన కాలుష్యం ఎక్కడ గుర్తించినా తక్షణ నియంత్రణ చర్యలు చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక పర్యావరణ టాస్క్‌ఫోర్స్ నిరంతరం తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలి. అవసరమైతే పీసీబీ నుంచి కేటాయించిన రూ.100 కోట్ల నిధులను మురుగు నియంత్రణకు సమర్థంగా వినియోగించాలని సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లో ఇప్పటికే జీరో లిక్విడ్ డిశ్చార్జ్ లక్ష్యంతో చర్యలు మొదలయ్యాయని తెలిపారు. పుష్కరాల నాటికి వాటిని 'మోడల్ పుష్కర పంచాయతీలు'గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. గోదావరి ప్రక్షాళన తర్వాత కృష్ణా సహా ఇతర ప్రధాన నదులపైనా ఇదే తరహా కార్యాచరణ చేపట్టి, భవిష్యత్తు కృష్ణా పుష్కరాలను కూడా 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' స్ఫూర్తితో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పవన్ స్పష్టం చేశారు.

## మంత్రుల ఫొటోలు లేకుండా ప్రకటనలేంటి?

- అధికారులపై సీఎం చంద్రబాబు సీరియస్

వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ప్రకటనల్లో ప్రోటోకాల్ ఉల్లంఘన, సమన్వయ లోపంపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించిన ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదని స్పష్టం చేశారు. వెలిగొండ, పోలవరం ఎల్ఎంసీ కార్యక్రమాల ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు ఫొటో లేకపోవడాన్ని సీఎం తప్పుబట్టారు. ఇలాంటి తప్పులు మరోసారి పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ సమన్వయంతో పనిచేశాయని చంద్రబాబు తెలిపారు. మంత్రి రామానాయుడు సింప్లిసిటీతో వ్యవహరిస్తూ సమర్థంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ఇతర అంశాలపైనా సీఎం పలు సూచనలు చేశారు. దుగరాజపట్నం వద్ద షిప్‌బిల్డింగ్ యూనిట్ ఏర్పాటు కానుందని వెల్లడించారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించి ప్రతి గ్రామానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడంతో పాటు శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

# జగన్నాథుడి ఆస్తులు.. కళ్లు చెదిరే లెక్కలు

**రూ.1,911 కోట్ల డిపాజిట్లు.. 60,821 ఎకరాల భూమి**



పూరీ జగన్నాథ ఆలయానికి ఉన్న ఆస్తుల వివరాలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం ఆలయానికి బ్యాంకుల్లో మొత్తం రూ.1,911.80 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇందులో రూ.1,811.10 కోట్లు మూడు పథకాల కింద ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా ఉన్నాయి. వీటిలో రూ.1,311.10 కోట్లు వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉండగా, మరో రూ.500 కోట్లు ఒడిశా ప్రభుత్వం ఇచ్చిన కార్పస్ ఫండ్‌గా ఉన్నాయి. సేవింగ్స్, కరెంట్, ఫ్లెక్సీ ఖాతాల్లో మరో రూ.100.71 కోట్లు ఉన్నట్లు ఆలయ పరిపాలన తెలిపింది. భక్తుల విరాళాలు, ఆలయానికి చెందిన క్వారీలు, గనుల ఆదాయం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీలు, భూముల విక్రయాలు, ప్రభుత్వ గ్రాంట్లు ఆలయానికి ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్నాయి. హుండీ కానుకలను ప్రతిరోజూ లెక్కించి వివరాలను బహిరంగంగా ప్రదర్శిస్తున్నామని అధికారులు తెలిపారు. డిజిటల్ విరాళాల కోసం ప్రారంభించిన 'సమర్పణ' వేదిక ద్వారా ఆగస్టు 31 నాటికి రూ.56.71 లక్షలు సమకూరాయి.

### ఆరు రాష్ట్రాల్లో ఆలయ భూములు

ఆర్థిక ఆస్తులతో పాటు జగన్నాథ ఆలయానికి భారీగా భూములు కూడా ఉన్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 60,821 ఎకరాల భూమి ఆలయానికి చెందినదిగా అధికారులు వెల్లడించారు. ఇందులో ఒడిశాలోని 24 జిల్లాల్లోనే 60,426 ఎకరాలు ఉన్నాయి. మరో 395 ఎకరాలు పశ్చిమ బెంగాల్ సహా ఆరు ఇతర రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. ఆలయానికి చెందిన బంగారం, వజ్రాలు, ఇతర విలువైన వస్తువులు రత్న భాండాగారంలో భద్రపరిచారు. 48 ఏళ్ల తర్వాత తొలిసారిగా రత్న భాండాగారంలోని విలువైన వస్తువుల సమగ్ర లెక్కింపు ప్రస్తుతం కొనసాగుతోంది. ఆలయ ఆస్తుల సంరక్షణ తమ ప్రధాన బాధ్యతగా అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో గత 25 ఏళ్లలో ఆలయంలో నగదు, ఆభరణాలు, విగ్రహాల చోరీకి సంబంధించి కనీసం ఏడు ఘటనలు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. 12వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం 1955 శ్రీ జగన్నాథ ఆలయ చట్టం ప్రకారం ఒడిశా ప్రభుత్వ న్యాయశాఖ పరిధిలో నిర్వహించబడుతోంది.

# టౌన్ ప్లానింగ్ అధికారి ఇంట్లో డబ్బే డబ్బు

- రూ.3.54 కోట్ల అక్రమ ఆస్తుల గుర్తింపు
- ఎనిమిది చోట్ల ఏకకాలంలో ఏసీబీ సోదాలు

సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి ఉయ్యాల సోమయ్యపై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. సూర్యాపేటలోని ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహించి సుమారు రూ.3.54 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించింది. కోదాడ మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ టౌన్ ప్లానింగ్ అధికారిగానూ సోమయ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినీతి మార్గాల్లో తన తెలిసిన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై కేసు నమోదైంది.



సోదాల్లో సూర్యాపేట జిల్లాలో మూడు ఎకరాల మూడు గుంటల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలు లభించాయి. సూర్యాపేట, హయత్‌నగర్ ప్రాంతాల్లో ఐదు నివాస ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు గుర్తించారు. వీటిలో జీ+1, జీ+2, జీ+4 భవనంతో పాటు పెంట్‌హౌస్, రెండు గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. వీటి అధికారిక విలువ రూ.2.75 కోట్లుగా ఉన్నట్లు ఏసీబీ తెలిపింది. మరో ఎనిమిది ఓపెన్ ప్లాట్ల పత్రాలు కూడా లభించాయి. వాటి అధికారిక విలువ రూ.2.58 లక్షలుగా గుర్తించారు.

### బంగారం, నగదు, వాహనాల గుర్తింపు

ఆస్తుల పత్రాలతో పాటు భారీగా నగదు, బంగారం, వెండి, వాహనాలు కూడా గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షలు, 709 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,750 గ్రాముల వెండి ఆభరణాలు గుర్తించారు. బంగారం, వెండి విలువ సుమారు రూ.20 లక్షలుగా అంచనా వేశారు. రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు కలిపి సుమారు రూ.25.20 లక్షల విలువైన వాహనాలను గుర్తించారు. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు మరో రూ.11 లక్షల విలువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. 66.9 తులాల బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ తీసుకున్నట్లు కూడా గుర్తించారు. అయితే గుర్తించిన ఆస్తుల అధికారిక విలువ కంటే మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండొచ్చని ఏసీబీ పేర్కొంది. మరిన్ని ఆస్తులపై అధికారులు ప్రస్తుతం తనిఖీలు, ధ్రువీకరణ కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సోమయ్యను హైదరాబాద్‌లోని ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి ఫర్ ఎస్పీఈ, ఏసీబీ కేసుల కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



# కులగణనలో నో ఓబీసీ జాబితాలు

- ఓబీసీ లెక్కలపై కేంద్రం కొత్త మలుపు

2027 జనగణనలో కులాల వారీగా వివరాలు సేకరించే విధానంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. మొదట కేంద్రం, రాష్ట్రాల ఓబీసీ జాబితాలను ఉపయోగించే అంశాన్ని పరిశీలించినా, చివరకు ఆ ప్రతిపాదనను పక్కన పెట్టింది. కారణం.. ఓబీసీ జాబితాలు పూర్తిగా కులాల జాబితాలు కాకుండా వివిధ సామాజిక వర్గాలు, తరగతుల జాబితాలుగా ఉండటమే అని అధికారులు చెబుతున్నారు. కొన్ని జాబితాల్లో కులాలకు బదులుగా వృత్తులు, వలస వచ్చిన వర్గాలు, నిర్దిష్ట కార్మిక సమూహాలు వంటి వివరాలు ఉన్నాయని తెలిపారు. అందువల్ల వాటిని నేరుగా కులాలుగా పరిగణించి జనగణనలో నమోదు చేయడం సమస్యలకు దారితీస్తుందని కేంద్రం భావించింది.

### ఓపెన్ కాలమ్‌పైనే కేంద్రం ఆధారం

ఎస్సీ, ఎస్టీ వర్గాలను మాత్రం రాష్ట్రపతి జాబితాల ఆధారంగా ఎప్పటిలాగే లెక్కించనున్నారు. మిగతా కులాల కోసం జనగణనలో ఓపెన్ కాలమ్ విధానాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఈ విధానంపై ఓబీసీ సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా పలువురు నేతలు ఓబీసీ వర్గాలను ప్రత్యేకంగా గుర్తించి లెక్కించాలని డిమాండ్ చేస్తున్నారు. ఓపెన్ కాలమ్‌తో గతంలో జరిగిన సామాజిక, ఆర్థిక కుల గణన-2011 తరహా సమస్యలు మళ్లీ ఎదురయ్యే అవకాశం ఉందని వారు అంటున్నారు. 2011 కులగణనలో ఏకంగా 46 లక్షలకు పైగా కుల పేర్లు నమోదైన విషయాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు.

### రాష్ట్రాల జాబితాలతోనూ భిన్నతలే

కేంద్రం రాష్ట్రాల ఓబీసీ జాబితాలను పరిశీలించినప్పుడు మరో కీలక సమస్య బయటపడింది. ఒక రాష్ట్రంలో ఓబీసీగా ఉన్న వర్గం మరో రాష్ట్రంలో ఎస్సీ లేదా ఎస్టీగా ఉండే పరిస్థితి ఉంది. అలాగే కొన్ని జాబితాల్లో స్థానికంగా పుట్టినవారు, నిర్దిష్ట వృత్తుల్లో ఉన్నవారు, టీ తోట కార్మికులు, స్థిరపడిన వర్గాలు వంటి కులంగా పరిగణించలేని వివరాలు ఉన్నాయి. దాదాపు 3,000 ఓబీసీ వర్గాల్లో ఇవి కొంతమేర మాత్రమే ఉన్నా, లెక్కల ఖచ్చితత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు భావించారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన తర్వాతే అత్యున్నత స్థాయిలో చర్చించి ఓపెన్ కాలమ్ విధానాన్ని ఖరారు చేసినట్లు అధికారులు వెల్లడించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలు ప్రధానంగా ఓబీసీ జనాభాను ఖచ్చితంగా లెక్కించాలనే డిమాండ్‌తో కులగణనను ముందుకు తెచ్చాయి. ప్రస్తుతం ఆ అంశం 2027 జనగణనలో మరోసారి కీలక రాజకీయ చర్చగా మారింది.

రాజ్య సంస్కరణ
శుక్రవారం, 4.9.2026, మేడ్చల్ మల్కాజిగిరి

# ఈఓఎస్-05 విజయవంతం!



## అంతరిక్షంలోకి భారత్ మరో అడుగు
## వర్షంలోనూ విజయగర్జన చేసిన ఇస్రో రాకెట్
## జియోసింక్రోనస్ కక్ష్యలోకి తొలి ఇమేజింగ్ ఉపగ్రహం
## జూనా-05తో ఇస్రో మరో చారిత్రక విజయగాథ
## GSLV-F17 ప్రయోగంతో భారత్ మరో మైలురాయి

### శ్రీహరికోట నుంచి మరో సంచలనం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి GSLV-F17 రాకెట్ జూనా-05 ఉపగ్రహంతో విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. సెప్టెంబర్ 4 శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు రెండో ప్రయోగ వేదిక నుంచి రాకెట్ ప్రయోగం జరిగింది. ఆ సమయంలో వర్షం కురుస్తున్నప్పటికీ ప్రయోగం ఎలాంటి ఆటంకం లేకుండా సాగింది. 51.7 మీటర్ల ఎత్తైన GSLV-F17 రాకెట్ చీకటిని చీల్చుకుంటూ నిప్పులు చిమ్ముతూ అంతరిక్షంలోకి దూసుకెళ్లిన దృశ్యం ఆకట్టుకుంది. చెన్నైకి సుమారు 135 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం మరోసారి భారత అంతరిక్ష సామర్థ్యానికి వేదికగా నిలిచింది. 27 గంటల కౌంట్‌డౌన్ పూర్తైన తర్వాత నిర్ణయించిన సమయానికే రాకెట్ ప్రయోగం జరిగింది. బుధవారం రాత్రి 11.30 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ శుక్రవారం తెల్లవారుజామున విజయవంతమైన ప్రయోగంతో ముగిసింది.

**జియోసింక్రోనస్ కక్ష్యలోకి కొత్త శక్తి**

ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణ జూనా-05 భూ పరిశీలన ఉపగ్రహం. అత్యాధునిక ఇమేజింగ్ సామర్థ్యాలతో రూపొందించిన ఈ ఉపగ్రహం భారత అంతరిక్ష పరిశీలన వ్యవస్థకు మరింత బలం చేకూర్చనుంది. ముఖ్యంగా జియోసింక్రోనస్ కక్ష్య నుంచి పనిచేసే భారత తొలి ఇమేజింగ్ ఉపగ్రహంగా జూనా-05 నిలవనుంది. భూమిని పరిశీలించేందుకు ఉపగ్రహాలను సాధారణంగా వివిధ కక్ష్యల్లో ప్రవేశపెడతారు. అయితే జియోసింక్రోనస్ కక్ష్య నుంచి అధునాతన ఇమేజింగ్ సామర్థ్యాన్ని వినియోగించుకోవడం ఈ మిషన్‌కు ప్రత్యేకతను తీసుకొచ్చింది. భూ ఉపరితల మార్పులు, ప్రకృతి వనరులు, వ్యవసాయం, పర్యావరణ పరిస్థితులు వంటి అంశాలపై మెరుగైన సమాచారాన్ని అందించే సామర్థ్యం ఇటువంటి ఉపగ్రహాలకు ఉంటుంది. దీంతో జూనా-05 ప్రయోగం కేవలం మరో ఉపగ్రహ ప్రయోగం మాత్రమే కాదు.. భారత భూ పరిశీలన సామర్థ్యాన్ని కొత్త దశకు తీసుకెళ్లే మిషన్‌గా ప్రాధాన్యం సంతరించుకుంది.

**GSLVపై ఇస్రో నమ్మకం మరింత బలపడింది**

జూనా-05ను మోసుకెళ్లిన GSLV-F17 ప్రయోగం కూడా ఇస్రోకు కీలకమే. జియోసింక్రోనస్ కక్ష్యలకు భారీ ఉపగ్రహాలను చేర్చే సామర్థ్యం ఉన్న +ూాఎ కుటుంబ రాకెట్లు భారత స్వదేశీ ప్రయోగ సామర్థ్యానికి ముఖ్యమైన ఆధారం. తన సొంత ప్రయోగ వాహనాల ద్వారా అధునాతన ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపగల సామర్థ్యాన్ని భారత్ మరోసారి చాటింది. తెల్లవారుజామున జరిగిన ఈ ప్రయోగం సమయంలో వర్షం ఉన్నప్పటికీ ప్రయోగ కార్యకలాపాలు నిర్ణీత ప్రణాళిక ప్రకారం కొనసాగాయి. కౌంట్‌డౌన్ ప్రారంభం నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లే వరకు ఇస్రో శాస్త్రవేత్తలు పలు దశలను జాగ్రత్తగా పర్యవేక్షించారు. రెండో ప్రయోగ వేదిక నుంచి GSLV-F17 విజయవంతంగా బయలుదేరడం మిషన్ నియంత్రణ వ్యవస్థల సమన్వయాన్ని కూడా చూపించింది. భూ పరిశీలన, అంతరిక్ష సాంకేతికతలో భారత్ తన సామర్థ్యాన్ని నిరంతరం విస్తరిస్తోందన్న సంకేతంగా ఈ ప్రయోగాన్ని చూడొచ్చు.

**శ్రీహరికోట నుంచి మరో విజయగాథ**

దేశ అంతరిక్ష ప్రయాణంలో శ్రీహరికోటకు ప్రత్యేక స్థానం ఉంది. అక్కడి నుంచి జరిగే ప్రతి ప్రయోగం భారత్ శాస్త్రసాంకేతిక పురోగతికి మరో అధ్యాయాన్ని జోడిస్తోంది. తాజాగా GSLV-F17 ద్వారా జూనా-05ను అంతరిక్షంలోకి పంపడం కూడా అదే వరుసలో మరో ముఖ్యమైన ఘట్టం. భూ పరిశీలన ఉపగ్రహాల ద్వారా లభించే అధునాతన చిత్రాలు భవిష్యత్తులో వ్యవసాయం నుంచి విపత్తుల నిర్వహణ వరకు అనేక రంగాలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ మిషన్ విజయంతో జియోసింక్రోనస్ కక్ష్యలో ఇమేజింగ్ సామర్థ్యాన్ని వినియోగించుకునే విషయంలో భారత్ మరో అడుగు ముందుకు వేసింది. వర్షం, చీకటి, తెల్లవారుజామున సమయాన్ని లెక్కచేయకుండా నిర్ణయించిన సమయానికి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లడం మిషన్ విజయానికి నిదర్శనంగా నిలిచింది. GSLV-F17 ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో ఖాతాలో మరో ఘన విజయం చేరింది. EOS-05తో భారత అంతరిక్ష పరిశోధన కొత్త అవకాశాల వైపు అడుగులు వేస్తోంది.

# ఎల్‌నినో ఎఫెక్ట్



**రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోవద్దు**

**ప్రత్యామ్నాయ పంటలపై ఫోకస్**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం 52 శాతం లోటుగా నమోదవడంతో రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోకూడదని స్పష్టం చేశారు. సాధారణంగా 90 శాతం భూమి సాగులోకి రావాల్సి ఉండగా ప్రస్తుతం 60--65 శాతం మాత్రమే సాగులోకి వచ్చిందని మంత్రి పార్థసారథి తెలిపారు. రైతులను ఆరుతడి పంటల వైపు మళ్లించేందుకు 90 వేల కిలోల విత్తనాలు సిద్ధం చేయడంతో పాటు రూ.90 కోట్ల సబ్సిడీకి సీఎం ఆమోదం తెలిపారన్నారు. పశుగ్రాసం కొరత నివారణకు జీ రామ్ జీ ద్వారా చర్యలు చేపట్టను న్నారు. ఉద్యాన పంటలకు నీరందించేం దుకు కాలువలు, బిందు సేద్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలోని 14,829 నివాస ప్రాంతాల్లో తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైతే బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కాణిపాకం బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం**

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం పలికింది. ఈ నెల 14 నుంచి అక్టోబర్ 4 వరకు వైభవంగా నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ మేరకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఛైర్మన్ సురేంద్రబాబు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు .సీఎంకు వేదాశీర్వచనం పలికారు. అనంతరం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి చిత్రపటాన్ని అందజేయడంతో పాటు స్వామివారి ప్రసాదాలను అందించారు. ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో జరిగే కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఈసారి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఆలయ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైతే ఉత్సవాలకు మరింత ప్రాధాన్యం లభించనుంది.

**ఓవైపు చమురు మంటలు**

# మరోవైపు భారత్ వృద్ధి దూకుడు!

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భారత్ జవాబు
## హర్మ్యూజ్ మూసుకున్నా.. వృద్ధి ఆగలేదు



2026 ఏప్రిల్ నుంచి జూన్ వరకు భారత్ ఆర్థిక వ్యవస్థకు పరీక్షా కాలమే. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో హర్మ్యూజ్ జలసంధిలో చమురు రవాణా తీవ్రంగా దెబ్బతింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 120 డాలర్లను తాకింది. రూపాయి రికార్డు స్థాయికి పడిపోయింది. ముడి చమురు ఉత్పత్తిదారుల ధరల సూచీ ఏకంగా 58 శాతం పెరిగింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్ జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది అంచనా వేసిన 7 శాతానికి మించి ఉండటం ప్రత్యేకత. వాస్తవ స్థూల విలువ 8.2 శాతం, నామమాత్ర జీడీపీ 10.3 శాతం పెరిగాయి. అమెరికా 1.5 శాతం, చైనా 4.3 శాతం, బ్రిటన్ 0.4 శాతం వృద్ధితో పోలిస్తే భారత్ పనితీరు స్పష్టంగా ముందుంది. ఈ వృద్ధి ఒక్క రంగానికే పరిమితం కాలేదు. తయారీ రంగం 9.2 శాతం, నిర్మాణ రంగం 7.7 శాతం, సేవల రంగం 10 శాతం వృద్ధి సాధించాయి. స్థిర మూలధన పెట్టుబడులు 11.9 శాతం పెరగడంతో పెట్టుబడి రేటు జీడీపీలో 31.4 శాతం నుంచి 34.3 శాతానికి చేరింది. ప్రైవేటు వినియోగం 7.1 శాతం పెరిగింది. సుంకాల ఒత్తిడి, యుద్ధ పరిస్థితుల మధ్య ఎగుమతులు 12 శాతం పెరగడం మరో కీలక పరిణామం.

**ప్రభుత్వం కంటే ప్రైవేట్ రంగమే ముందుంది**

ఈ వృద్ధిలో మరో ముఖ్యమైన అంశం ప్రైవేటు ఆర్థిక కార్యకలాపాల బలం. ప్రభుత్వ వినియోగ వ్యయం కేవలం 4.3 శాతం పెరిగినప్పటికీ, ప్రైవేటు రంగం వృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా మారింది. లిస్టెడ్ కంపెనీల నిర్వహణ లాభాలు 19.3 శాతం పెరిగాయి. బ్యాంకు రుణాల వృద్ధి కూడా 19.3 శాతంగా ఉంది. నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెట్టింపై 7.8 బిలియన్ డాలర్లకు చేరాయి. కేంద్రం నికర పన్ను ఆదాయం 17.8 శాతం పెరిగింది. ఈ పరిస్థితికి కేంద్రం తీసుకున్న కొన్ని తక్షణ నిర్ణయాలు కూడా తోడయ్యాయి. పెట్రోల్ ధరను లీటరుకు రూ.108.7, డీజిల్‌ను రూ.98.1 వద్ద నియంత్రించడం వల్ల అంతర్జాతీయ చమురు ధరల ప్రభావం నేరుగా వినియోగదారులపై పడలేదు. దిగుమతి ధరల సూచీ 30 శాతానికి పైగా పెరిగినా గృహ వినియోగ ధరల సూచీ 2.6 శాతంగా ఉండటం దీనికి నిదర్శనం. విదేశాల్లో ఉన్న భారతీయుల నిధులను ఆకర్షించేందుకు తీసుకొచ్చిన ఎఫ్‌సీఎన్ఆర్(బీ) స్వాప్ విండో ద్వారా 65.4 బిలియన్ డాలర్లు సమకూరాయి. దీంతో రూపాయి పతనం మరింత తీవ్రం కాకుండా కొంత అడ్డుకట్ట పడింది. ఆహార ధాన్యాల నిల్వలు కూడా బఫర్ ప్రమాణం కంటే 4.7 రెట్లు అధికంగా ఉండటంతో ఆహార ధరలను అదుపులో ఉంచే అవకాశం లభించింది. గతంలో ఇచ్చిన పన్ను రాయితీలు కూడా కుటుంబాల చేతుల్లో నగదును పెంచి వినియోగానికి మద్దతిచ్చాయి.

**రూపాయి, వాణిజ్యం.. అసలు పరీక్ష ఇక్కడే**

రూపాయి 95.7 స్థాయికి చేరుకోవడం మరో ఆందోళన. ఎఫ్‌సీఎన్ఆర్(బీ) విండో ఆగస్టు 31తో ముగిసింది. రూపాయిలోకి వచ్చిన అదనపు ద్రవ్య లభ్యతను ఆర్‌బీఐ వెనక్కి తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఆగస్టులో రోజువారీ ద్రవ్య శోషణ సగటు రూ.3.48 లక్షల కోట్లకు చేరింది. రూపాయిని ఒక నిర్దిష్ట స్థాయిలో కృత్రిమంగా నిలబెట్టడం కంటే.. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కదలనివ్వడం, ఆర్‌బీఐ నిల్వలను తీవ్ర హెచ్చుతగ్గులను నియంత్రించేందుకు మాత్రమే ఉపయోగించడం మంచిది. మరోవైపు అమెరికా అదనపు 10 శాతం సుంకాలు జూలై 24 నుంచి అమల్లోకి వచ్చాయి. స్మార్ట్‌ఫోన్లు, పెట్రోలియం ఉత్పత్తులు, ఔషధాలకు మినహాయింపులు ఉండటంతో అమెరికాకు ఎగుమతులు జూలైలో 12.9 శాతం పెరిగాయి. కానీ దుస్తులు, రత్నాభరణాలు, తోలు, సిరామిక్ రంగాలు దెబ్బతిన్నాయి. ఇవే భారీ ఉపాధి కల్పించే రంగాలు కావడంతో ప్రత్యేక ప్రోత్సాహకాలు అవసరం. మరో కీలక అంశం ప్రభుత్వ పెట్టుబడుల నుంచి ప్రైవేటు పెట్టుబడులకు మార్పు. జూన్ త్రైమాసికంలో కేంద్ర మూలధన వ్యయం 23.7 శాతం పెరిగింది. గత ఏడాది ఇదే సమయంలో 52 శాతం పెరిగిన నేపథ్యంలో వేగం తగ్గింది. ఇదే సమయంలో క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి 15.2 శాతం, యంత్రాల దిగుమతులు 51.5 శాతం పెరగడం ప్రైవేటు పెట్టుబడులు కదులుతున్నాయన్న సంకేతం. ఇక కొత్త వినియోగ ప్రోత్సాహకాలు ఇవ్వడం కంటే రాష్ట్రాలకు దీర్ఘకాలిక వడ్డీ రహిత రుణాల ద్వారా మౌలిక వసతుల పెట్టుబడులను పెంచడం మంచిది. మొత్తంగా చూస్తే.. భారత్ 7.8 శాతం వృద్ధి సాధించింది అనేది అదృష్టం కాదు. ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు పెట్టుబడుల కదలిక, నియంత్రిత ధరలు, బలమైన వినియోగం కలిసి ఈ ఫలితాన్ని ఇచ్చాయి. ఇక ముందున్న మూడు త్రైమాసికాల్లో ఆర్థిక క్రమశిక్షణే అసలు పరీక్ష. చమురు ధరలు తగ్గితే ఆదాయం తిరిగి పెంచాలి. అదనపు ద్రవ్య లభ్యతను నియంత్రించాలి. రూపాయిని మార్కెట్ శక్తులకు అనుగుణంగా కదలనివ్వాలి. రాష్ట్రాల పెట్టుబడులకు మద్దతు ఇవ్వాలి. ఆదాయ వ్యయాలపై నియంత్రణ కొనసాగించాలి. విపరీతమైన బాహ్య షాక్ మధ్య భారత్ తన బలాన్ని చూపించింది. ఇప్పుడు అదే బలాన్ని స్థిరమైన వృద్ధిగా మార్చడం ముందున్న లక్ష్యం.

**ఇక ముందు ఐదు సవాళ్లు కీలకం**

7.8 శాతం వృద్ధి సాధించినా.. ఏడాది మొత్తం 7 శాతానికి పైగా వృద్ధిని కొనసాగించడం అంత సులభం కాదు. మొదటి సవాలు చమురు ధరలు. రెండోది రుతుపవనాలు. మూడోది రూపాయి విలువ. నాలుగోది అమెరికా సుంకాల ప్రభావం. ఐదోది ప్రభుత్వ పెట్టుబడు ల నుంచి ప్రైవేటు పెట్టుబ డులకు మార్పు. ఆగస్టులో భారత బాస్కెట్ చమురు ధర సగటున 89.7 డాల ర్లుగా ఉంది. సమీప భవి ష్యత్తులో పెద్దగా తగ్గే అవ కాశం లేదని ప్రధాన ఆర్థిక సలహాదారు అంచనా వేస్తున్నారు. చమురు ధరలను నియంత్రించేందుకు సబ్సిడీలు 37.4 శాతం పెరిగాయి. ఎక్సైజ్ ఆదాయం 22.4 శాతం తగ్గింది. కాబట్టి ధరలు తగ్గినప్పుడు ఎక్సైజ్‌ను క్రమంగా పెంచి ప్రభుత్వ ఆదాయాన్ని తిరిగి పెంచుకోవాల్సి ఉంటుంది. ఎరువుల సబ్సిడీ 57.6 శాతం పెరిగిన నేపథ్యంలో రైతులకు ఎకరాకు నేరుగా సాయం చేసే విధానాన్ని పరిశీలించాలి. వర్షాభావం మరో ప్రమాదం. జూన్ చివర్లో 38 శాతంగా ఉన్న వర్షపాతం లో టు జూలై చివరికి 13 శాతానికి తగ్గినా.. నాలుగు ప్రాంతాల్లోనూ లోటు కొన సాగుతోంది. పప్పులు, వం ట నూనెల దిగుమతులపై సుంకాలను తాత్కాలికం గా తగ్గించడం, అవసరమై తే బియ్యం, గోధుమలను మార్కెట్‌లోకి విడుదల చేయడం ద్వారా ధరలను నియంత్రించవచ్చు. ద్రవ్యోల్బణం విషయంలో ఆర్‌బీఐ కూడా తొందరపడాల్సిన అవసరం లేదు. కోర్ ద్రవ్యోల్బ ణం జూలైలో 2.7 శాతంగా ఉండటంతో చమురు షాక్‌ను తాత్కాలిక ధరల మార్పుగా చూడవచ్చు.



**పచ్చదనమే భావి తరాల భద్రతకు పునాది**

**తీర రక్షణకు పచ్చదనం.. దీర్ఘకాలిక ప్రణాళిక**

బాపట్ల జిల్లా సూర్యలంకలో పర్యావరణ పరిరక్షణపై ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు కీలక సూచనలు చేశారు. భావితరాల భద్రతకు పచ్చదనం పునాది అని, పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. గురువారం విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి సముద్ర తీరంలో తాటి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం కనీసం 20 ఏళ్ల ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. తీర ప్రాంతాల్లో తాటి చెట్లు, మడ అడవులు పెంచడం ద్వారా సముద్ర కోతను అరికట్టడంతో పాటు తుపాన్లు, సునామీల సమయంలో సహజ రక్షణ కవచంగా ఉపయోగపడతాయని తెలిపారు. మొక్క నాటడంతో బాధ్యత పూర్తికాదని, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు, యువతతో పాటు అన్ని వర్గాలను పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామని చెప్పారు. సూర్యలంకలో ఆలివ్ రిడ్లీ తాబేళ్ల సంరక్షణ చర్యలను అభినందించారు. 20 ఏళ్ల క్రితం నాటిన తాటి చెట్లు సహజ రక్షణ గోడగా మారిన తీరును పరిశీలించి, మడ అడవులను కూడా స్వయంగా సందర్శించారు.



**సూర్యలంకకు హీరో శ్రీకాంత్ ప్రశంసలు**

**షూటింగ్‌లకు బెస్ట్ స్పాట్ అంటూ కితాబు**

బాపట్ల సూర్యలంక తీర ప్రాంతాన్ని పర్యాటక మణిహారంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ చేస్తున్న కృషిని హీరో శ్రీకాంత్ ప్రశంసించారు. సినీ ప్రముఖులు శ్రీకాంత్, మలయాళ దర్శకుడు, నటుడు మేజర్ రవి తమ చిత్ర బృందంతో సూర్యలంకను సందర్శించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వచ్చిన చిత్ర బృందానికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఘన స్వాగతం పలికారు. యాగంటి రిసార్ట్స్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో సూర్యలంక అభివృద్ధి, పర్యాటక అవకాశాలపై చర్చించారు. అనంతరం హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రకృతి అందాలు, సముద్ర అలల హోరుతో సూర్యలంకలో గడపడం ప్రశాంతత, ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతం సినిమా షూటింగ్‌లకు ఎంతో అద్భుతంగా, అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ సూర్యలంకను అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు నరేంద్ర వర్మ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో సూర్యలంక సినీ షూటింగ్‌లకు మరింత కీలక వేదికగా మారే అవకాశముందని తెలిపారు. కార్యక్రమంలో నటులు మహాదేవన్, రాజా రవీంద్ర, నిర్మాత సురేష్ కొండేటి తదితరులు పాల్గొన్నారు.



**హంగులతో ప్రొద్దుటూరు ఎస్‌డీపీఓ కార్యాలయం**

**మెరుగైన పోలీస్ సేవలకు ఆధునిక కార్యాలయం**

ప్రొద్దుటూరు ఎస్‌డీపీఓ కార్యాలయం ఆధునిక హంగులతో కొత్త రూపు సంతరించుకుంది. అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా కార్యాలయాన్ని పునరుద్ధరించారు. గురువారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. ప్రకాష్ బాబు, ఏఎస్పీ యు. విబు కృష్ణ ఐపీఎస్‌తో పాటు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యాలయ పునరుద్ధరణకు స్వరూప్ ఐ హాస్పిటల్స్ డాక్టర్ వై.వి. స్వరూప్ కుమార్ రెడ్డి ప్రధానంగా ఆర్థిక సహకారం అందించగా, పలువురు దాతలు తోడ్పాటునందించారు. పోలీస్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రజలు, ప్రముఖులు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎస్పీ తెలిపారు. ఏఎస్పీ విబు కృష్ణ చొరవతో చేపట్టిన పనులతో కార్యాలయానికి ఆధునిక రూపం వచ్చిందని పేర్కొంటూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



**ఇల్లు ఇచ్చారు.. వసతులు మరిచారు!**

**జగనన్న కాలనీలో సదుపాయాల కోసం బీజేపీ డిమాండ్**

ప్రొద్దుటూరు జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ ప్రొద్దుటూరు నగరం-1 నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు పొందిన కుటుంబాలు కాలనీలో స్థిరపడినా.. రోడ్లు, తాగునీరు, నీటి నిల్వ, విద్యుత్, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్ల అభివృద్ధితో పాటు నిరంతర తాగునీరు, వాటర్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి ఇంటికి విద్యుత్, అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించి క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. సొంత నిధులతో ఇళ్లు పూర్తి చేసుకునే కుటుంబాలకు మున్సిపల్ సహకారం అందించాలని సూచించారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి, కాలనీని స్వయంగా సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొండా కుటుంబం పేరు తెలంగాణ రాజకీయాల్లో వినిపిస్తే చాలు.. ఏదో ఒక వివాదం తెరపైకి రావడం ఇప్పుడు కొత్త విషయం కాదు. రాజకీయాలు, వ్యక్తిగత విమర్శలు, వర్గపోరు, కేసులు, పార్టీ మార్పులు, అధిష్ఠానంతో విభేదాలు.. ఇలా కొండా కుటుంబ రాజకీయ ప్రస్థానం ఎన్నో మలుపులతో సాగింది. కొండా మురళీధర్ రావు వరంగల్ జిల్లా గీసుకొండ మండలం వంచనగిరి గ్రామానికి చెందినవారు. ఆయన తల్లిదండ్రులు మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉండటంతో గ్రామంలో వారి కుటుంబాన్ని పటేల్ కుటుంబంగా పిలిచేవారు. మరోవైపు కొండా సురేఖ హన్మకొండ పట్టణంలో జన్మించారు. ఆమె తండ్రి ఆర్అండ్‌బీలో ఇంజనీర్‌గా పనిచేశారు. సురేఖ పద్మశాలి సామాజికవర్గానికి చెందినవారు. వరంగల్ నగరంలోని ఎల్బీ కళాశాలలో చదువుతున్న సమయంలో మురళీ, సురేఖ పరిచయం ప్రేమగా మారింది. ఆ కాలంలో మావోయిస్టు అగ్రనేతగా ఉన్న దివంగత ఆర్కే కూడా వీరిద్దరి క్లాస్‌మేట్‌గా ఉన్నారని చెబుతారు. అయితే ఈ ప్రేమకు ఇరు కుటుంబాల పెద్దల నుంచి అంగీకారం రాలేదు. దీంతో పెద్దల అభ్యంతరాలను లెక్కచేయకుండా సురేఖను తీసుకెళ్లి మురళీ వివాహం చేసుకున్నారు. అక్కడి నుంచే ఈ జంట జీవితంలో పోరాటం మొదలైందని చెప్పాలి. కుటుంబ వ్యతిరేకతను ఎదుర్కొని పెళ్లి చేసుకున్న ఈ జంట తర్వాత రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి.. ఒకరికి ఒకరు అండగా నిలుస్తూ వరంగల్ రాజకీయాల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఆ గుర్తింపు ఎంత బలంగా పెరిగిందో.. వివాదాల చరిత్ర కూడా అంతే వేగంగా విస్తరించింది.



# కొండా అంటే వివాదమేనా?

## ప్రతి మలుపులో కొత్త సంచలనమేనా?

### ప్రేమ పెళ్లి నుంచి రాజకీయ రణరంగం వరకు

### వివాదాలు, సంచలనాలకు కేరాఫ్ అడ్రస్ కొండా ఫ్యామిలీ



**కొండా కథకు**

**అసలు ట్విస్ట్ ఇదే**

తెలంగాణ రాజకీయాల్లో కొండా కుటుంబం పేరు వినిపిస్తే వివాదాలు, రాజకీయ పోరాటాలు గుర్తుకొచ్చే పరిస్థితి ఏర్పడింది. ప్రత్యర్థులను నేరుగా ఢీకొనడం, తమకు అన్యాయం జరిగిందని భావించినప్పుడు బహిరంగంగా ప్రశ్నించడం, పార్టీ నిర్ణయాలపై కూడా అసంతృప్తిని వ్యక్తం చేయడం కొండా కుటుంబ రాజకీయ శైలిలో ప్రధానంగా కనిపించింది. టీడీపీతో మొదలైన రాజకీయ ప్రయాణం కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్, టీఆర్ఎస్ మీదుగా తిరిగి కాంగ్రెస్‌కు చేరినా.. వర్గ విభేదాలు మాత్రం వెంటాడుతూనే వచ్చాయి. అధికారంలో ఉన్న సమయంలోనూ ప్రత్యర్థులతో పోరు సాగింది.. పార్టీ మారిన సందర్భాల్లోనూ కొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వచ్చాయి. ఇప్పుడు తాజా వివాదం నేరుగా సీఎం రేవంత్ రెడ్డి చుట్టూ తిరుగుతుండటంతో పరిస్థితి మరింత సున్నితంగా మారింది. గతంలో కొండా కుటుంబంతో వచ్చిన విభేదాలను పార్టీ పెద్దలు చర్చల ద్వారా చల్లార్చారు. ఈసారి మాత్రం మంత్రి సురేఖ పదవి, పార్టీ క్రమశిక్షణ అంశాలు కూడా చర్చలోకి రావడంతో కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయం కీలకంగా మారింది. సురేఖ మంత్రి పదవిలో కొనసాగుతారా? పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలకు వెళ్తుందా? లేక మరోసారి రాజీ మార్గాన్నే ఎంచుకుంటుందా? అన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది. గత అనుభవాలు చూస్తే కొండా కుటుంబం చుట్టూ వివాదం ముగిసిన ప్రతిసారీ మరో రాజకీయ మలుపు కనిపించింది. అందుకే తాజా ఎపిసోడ్‌కు ముగింపు ఎక్కడ అన్నదానికంటే.. తర్వాతి ట్విస్ట్ ఏంటన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

**• టీడీపీతో మొదలైన రాజకీయ ప్రయాణం**

కొండా మురళీ రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీతో ప్రారంభమైంది. గీసుకొండ మండల టీడీపీ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. ఆ సమయంలో ఎర్రబెల్లి దయాకర్ రావుకు ప్రధాన అనుచరుడిగా మురళీ వ్యవహరించేవారు. అయితే రాజకీయాల్లో ఆయన శైలి మొదటి నుంచే సాధారణంగా ఉండేది కాదనే అభిప్రాయం అప్పట్లో ఏర్పడింది. వంచనగిరి సర్పంచ్ ఎన్నిక సందర్భంగా చోటుచేసుకున్న ఘటన ఈ ఇమేజ్‌ను మరింత బలపరిచింది. సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేసిన మురళీ.. తనకు పోటీగా ఎవరైనా నామినేషన్ వేస్తే ఇదే పరిస్థితి ఎదురవుతుందనే హెచ్చరికగా కుక్కను తుపాకీతో కాల్చిన ఘటన అప్పట్లో సంచలనంగా మారింది. ఆ తర్వాత ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో మురళీ ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అయితే వివిధ కేసులు, మావోయిస్టులతో సన్నిహిత సంబంధాల ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఆయనపై రౌడీషీట్ తెరిచారు. ఆ రౌడీషీట్ వెనుక ఎర్రబెల్లి దయాకర్ రావు పాత్ర ఉందనే అనుమానంతో మురళీ టీడీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి ఎర్రబెల్లి దయాకర్ రావు, కొండా దంపతుల మధ్య రాజకీయ వైరం మరింత పెరిగింది. గీసుకొండ ఎంపీపీ పదవి మహిళకు రిజర్వ్ కావడంతో కొండా సురేఖను ఎంపీటీసీగా పోటీ చేయించి ఎంపీపీగా చేశారు. అలా మురళీ వెనుక ఉన్న రాజకీయ శక్తి.. సురేఖ ద్వారా అధికార పదవిలోకి అడుగుపెట్టింది. ఇదే సమయంలో వరంగల్ ప్రాంతంలో కొండా దంపతుల ప్రభావం క్రమంగా పెరిగింది. తర్వాత కాంగ్రెస్ రాజకీయాల్లో సురేఖకు వచ్చిన అవకాశాలు.. మురళీ రాజకీయ వ్యవహార శైలి.. వీటన్నింటి కలయికతో కొండా కుటుంబం వరంగల్ రాజకీయాల్లో ప్రత్యేక శక్తిగా ఎదిగింది.

**• వైఎస్ఆర్ హయాంలో కొండా పవర్**

కొండా సురేఖ రాజకీయ ఎదుగుదలలో కీలక మలుపు సోనియాగాంధీ వరంగల్ పర్యటన. పత్తి రైతుల ఆత్మహత్యలతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించేందుకు సోనియాగాంధీ వరంగల్‌కు వచ్చిన సమయంలో ఆమె ప్రసంగాన్ని సురేఖ తెలుగులో అనువదించారు. ఆ సందర్భంలో సురేఖ సోనియాగాంధీ దృష్టిలో పడినట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత 1999లో పరకాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసిన సురేఖ స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. 2004, 2009 ఎన్నికల్లో కూడా వరుస విజయాలు సాధించి హ్యాట్రిక్ నమోదు చేశారు. ఈ కాలంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌కు సురేఖ అత్యంత సన్నిహిత అనుచరురాలిగా గుర్తింపు పొందారు. పరకాల నియోజకవర్గంలో వైఎస్ఆర్ మినహా ఇతర కాంగ్రెస్ నేతలకు పెద్దగా రాజకీయ స్థలం లేకుండా కొండా దంపతుల ప్రభావం పెరిగిందనే విమర్శలు వచ్చాయి. పీసీసీ అధ్యక్షులు, మంత్రులు పరకాలకు రావడంపై కూడా కొండా వర్గం ప్రభావం ఉండేదనే చర్చ సాగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ నేతలతో కొండా దంపతులకు సఖ్యత అంతగా లేదనే ప్రచారం కూడా బలపడింది. పొన్నాల లక్ష్మయ్య, డీఎస్ రెడ్యానాయక్, బస్వరాజ్ సారయ్య, గండ్ర వెంకటరమణ రెడ్డి వంటి నేతలతో వర్గ విభేదాలు కొనసాగినట్టు అప్పటి రాజకీయ పరిణామాలు సూచించాయి. అంటే కొండా కుటుంబం రాజకీయంగా బలపడుతున్న కొద్దీ.. ప్రత్యర్థుల జాబితా కూడా పెరుగుతూ వచ్చింది. ముఖ్యంగా ఎర్రబెల్లి దయాకర్ రావును ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా కొండా దంపతులు భావించేవారు. ఈ వైరం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాలేదు. తెలుగు యువత వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొల్లి ప్రతాప్ రెడ్డి హత్య కేసులో కొండా మురళీ ఏ1 నిందితుడిగా ఉన్నారని అప్పట్లో కేసు నమోదైంది. 2004లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ఎస్పీ నళిని ప్రభాత్ మురళీకి బేడీలు వేసి హన్మకొండ చౌరస్తాలో తిప్పిన ఘటన సంచలనంగా మారింది. ఆ కేసులో మురళీ జైలు జీవితం కూడా గడిపారు. ఈ ఘటన కొండా కుటుంబ రాజకీయ చరిత్రలో అత్యంత కీలకమైన వివాదాస్పద అధ్యాయాల్లో ఒకటిగా నిలిచింది.

**• అసెంబ్లీలో కన్నీళ్లు.. ఎర్రబెల్లి కౌంటర్**

మురళీ అరెస్టు, జైలు జీవితం సమయంలో సురేఖ చేసిన రాజకీయ పోరాటం మరో సంచలన అధ్యాయంగా మారింది. "నా మాంగల్యాన్ని కాపాడండి" అంటూ నిండు అసెంబ్లీలో స్పీకర్, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎదుట సురేఖ కన్నీళ్లు పెట్టుకున్న ఘటన అప్పట్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీనికి మరుసటి రోజు ఎర్రబెల్లి దయాకర్ రావు సుమారు పదిమంది వరకు వితంతు మహిళలను అసెంబ్లీకి తీసుకొచ్చారు. మురళీ కారణంగా తాము వితంతువులమయ్యామని ఆ మహిళలు ఆరోపిస్తున్న నేపథ్యంలో.. "వారి మాంగల్యాన్ని ఎవరు తిరిగి తెచ్చిస్తారు?" అంటూ ఎర్రబెల్లి అసెంబ్లీలో ప్రశ్నించడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. దీంతో కొండా వర్సెస్ ఎర్రబెల్లి పోరు మరింత ముదిరింది. మరోవైపు 2009లో మావోయిస్టు అగ్రనేత ఆర్కే అంత్యక్రియల్లో కొండా దంపతులు పాల్గొన్నారనే కారణంతో వారిపై పోటా చట్టం కింద కేసు నమోదైనట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఒకవైపు కాంగ్రెస్‌లో వైఎస్ఆర్‌తో సాన్నిహిత్యం.. మరోవైపు కేసులు, ప్రత్యర్థులతో రాజకీయ యుద్ధం.. కొండా దంపతుల ప్రస్థానం విభిన్న కోణాలతో సాగింది. వైఎస్ఆర్ మరణం తర్వాత పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ అప్పటి ముఖ్యమంత్రి కె. రోశయ్యపై సురేఖ తీవ్ర విమర్శలు చేశారు. ఒక దశలో మంత్రి పదవికి రాజీనామా చేస్తూ ఓ సామాజికవర్గానికి చెందిన ప్రముఖులపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సురేఖ రాజీనామాతో పరకాల ఉపఎన్నిక అనివార్యమైంది. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ఆమె వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. బీఆర్ఎస్ అభ్యర్థి మొలుగూరి భిక్షపతి చేతిలో సుమారు రెండు వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ ఓటమి తర్వాత జగన్‌తో విభేదాలు పెరగడంతో కొండా దంపతులు మరో రాజకీయ మలుపు తీసుకున్నారు.



**• సినిమా నుంచి సీఎం వరకు వివాదాల పరంపర**

కొండా సురేఖ మంత్రిగా ఉన్న సమయంలో మరో పెద్ద వివాదం సినీ పరిశ్రమతో ముడిపడింది. ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున, నటి సమంతపై సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సినీ రంగానికి చెందిన ప్రముఖులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం రాజకీయ చర్చను దాటి రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ వ్యవహారంపై అక్కినేని అమల ప్రియాంకగాంధీకి ఫిర్యాదు చేసినట్టు వార్తలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానంలో కూడా ఈ అంశం చర్చకు వచ్చింది. అయితే ఆ సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సురేఖకు అండగా నిలిచారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ వివాదం సద్దుమణిగిన కొద్దికాలానికే మంత్రి సురేఖ ఓఎస్డీ సుమంత్ వ్యవహారం మరో వివాదానికి దారితీసింది. ఈ అంశంలో సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి. సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులపై తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేయడంతో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బహిరంగమయ్యాయి. పరిస్థితి మరింత ముదరకుండా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్యవర్తిత్వం చేసి వివాదాన్ని ముగించేందుకు ప్రయత్నించారు. మరోవైపు కొండా మురళీ వ్యాఖ్యలు కూడా కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. కడియం శ్రీహరిపై వ్యక్తిగతంగా అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం, రేవూరి ప్రకాష్ రెడ్డిపై కూడా తీవ్ర పదజాలం ఉపయోగించడం వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంలో ఆయన క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. అనంతరం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఇలా కొండా కుటుంబం రాజకీయ ప్రత్యర్థులతో చేసే పోరాటం క్రమంగా వ్యక్తిగత విమర్శల స్థాయికి చేరుతోందనే అభిప్రాయం కాంగ్రెస్‌లో బలపడింది.

**• పార్టీలు మారినా కొండా దంపతుల వెంటే వివాదం**

2014లో కొండా దంపతులు అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి సురేఖ పోటీ చేసి విజయం సాధించారు. అయితే అధికార పార్టీలో చేరిన తర్వాత కూడా వివాదాలకు తెరపడలేదు. కేటీఆర్‌తో కాకుండా హరీశ్‌రావుతో సురేఖకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం కేసీఆర్ అసంతృప్తికి కారణమైందనే చర్చ అప్పట్లో సాగింది. కేటీఆర్ వరంగల్ పర్యటనకు వచ్చిన సందర్భాల్లో సురేఖ గైర్హాజరవడం కూడా పార్టీలో చర్చనీయాంశమైంది. 2018 ఎన్నికల సమయంలో కేసీఆర్ ఒకేసారి 110 మంది అభ్యర్థులను ప్రకటించినా.. కొండా సురేఖ అభ్యర్థిత్వాన్ని పెండింగ్‌లో ఉంచారు. దీంతో కొండా దంపతులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. చివరకు టీఆర్ఎస్‌కు దూరమై మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. సోనియాగాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన తర్వాత 2018లో పరకాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సురేఖ పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఆమె ఓటమి పాలయ్యారు. రాజకీయంగా మరోసారి వెనక్కి తగ్గినట్టుగా కనిపించిన కొండా కుటుంబం.. 2023లో మళ్లీ బలంగా పుంజుకుంది. వరంగల్ తూర్పు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సురేఖ ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో కొండా కుటుంబం మళ్లీ అధికార కేంద్రానికి చేరింది. అయితే అధికారం దక్కిన తర్వాత కూడా వర్గపోరు తగ్గలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ రావు వంటి నేతలతో కొండా దంపతులకు విభేదాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే. అంటే పార్టీ మారినా.. అధికారంలో ఉన్నా.. కొండా కుటుంబ రాజకీయ శైలి చుట్టూ వర్గపోరు అనే అంశం మాత్రం కొనసాగుతూనే వచ్చింది.



కొండా సురేఖ ఎపిసోడ్ తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రకంపనలు రేపుతోంది. మంత్రి పదవి నుంచి బర్తరఫ్.. హైకమాండ్‌పై ఆరోపణలు.. సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన విమర్శలు.. కుమార్తె సుస్మిత సవాళ్లు.. మరోవైపు పార్టీ క్రమశిక్షణ పేరుతో అధిష్ఠానం తీసుకున్న కఠిన నిర్ణయం.. ఇలా ఒకదాని వెంట మరొకటి పరిణామాలు రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. ''నన్ను తొలగించే ఆలోచన హైకమాండ్‌కు లేదు.. రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేయడం వల్లే వేటు పడింది'' అంటూ సురేఖ చేసిన ఆరోపణలు ఇప్పుడు అసలు రాజకీయ కథను మరో మలుపు తిప్పాయి. తన వివరణ తీసుకోకుండానే బర్తరఫ్ చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కుమార్తె వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం అన్యాయమని స్పష్టం చేశారు. అంతటితో ఆగకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం ప్రభుత్వ పనితీరుపై గుండెలపై చేయి వేసుకుని మాట్లాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌లోనే ఉంటానని చెబుతూనే.. పార్టీ తీరు మారాలని, ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతపై సర్వే చేయాలని సూచించారు. ఈ పరిణామాల మధ్య సుస్మిత రంగంలోకి దిగి ''నా తల్లికి అన్యాయం జరిగింది.. రేవంత్‌రెడ్డి నా తల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేయాలి'' అంటూ సవాల్ విసరడం మరింత కలకలం రేపింది. అసలు ఈ వివాదం ఎక్కడ మొదలైంది? సురేఖ చేసిన తప్పేంటి? రేవంత్ ఎందుకు పట్టుబట్టారు? హైకమాండ్ ఎందుకు తలొగ్గింది? కొండా కుటుంబం తర్వాతి అడుగు ఏంటి? ఇవే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్.



# కొండా హిట్ వికెట్
# క్యాబినెట్ నుంచి ఔట్



**• బర్తరఫ్‌తో మొదలైన అసలు రాజకీయ తుఫాన్**

తెలంగాణ కాంగ్రెస్‌లో ఒక్కసారిగా రాజకీయ వేడి పెరిగిపోయింది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్‌కు సిఫార్సు చేయడం, ఆ తర్వాత హైకమాండ్ నిర్ణయంతో ఆమె మంత్రి పదవి కోల్పోవడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. అసలు కొండా సురేఖ చేసిన తప్పేంటి? ఆమెను ఎందుకు టార్గెట్ చేశారు? ఇది కేవలం ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల ప్రభావమేనా? లేక చాలా కాలంగా పేరుకుపోయిన అంతర్గత విభేదాలకు ఇది చివరి అంకమా? ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణుల్లో ఇదే చర్చ జరుగుతోంది. కొండా సురేఖ మాత్రం తనపై తీసుకున్న చర్యను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. తన వివరణ తీసుకోకుండా నిర్ణయం తీసుకోవడం అన్యాయమని ఆమె తీవ్రంగా మండిపడ్డారు. మంత్రి పదవి పోయినందుకు తనకు బాధ లేదని, అయితే కారణం చెప్పకుండా, తన వాదన వినకుండా తొలగించడం మాత్రం జీర్ణించుకోలేకపోతున్నానని స్పష్టం చేశారు. తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడలేదని ఆమె వాదించారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నదారు సురేఖ. ఉరిశిక్ష పడిన వ్యక్తికీ చివరిసారిగా ఏదైనా చెప్పుకునే అవకాశం ఇస్తారని, తనకు మాత్రం ఎలాంటి అవకాశం ఇవ్వకుండా శిక్షించారని అన్నారు. తన కుమార్తె స్వతంత్ర వ్యక్తి అని, ఆమె వ్యక్తిగత అభిప్రాయాలను తాను నియంత్రించలేనని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను తాను ఖండించలేదనే కారణంతో తనపై చర్యలు తీసుకోవడం కక్షపూరిత చర్యగా భావిస్తున్నానని ఆరోపించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో మాత్రం నాయకత్వంపై బహిరంగ విమర్శలు పెరుగుతున్న పరిస్థితిని క్రమశిక్షణ విషయంలో తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఏర్పడిందనే వాదన వినిపించింది. దీంతో వ్యక్తిగత వ్యాఖ్యలు, కుటుంబ రాజకీయాలు, పార్టీ క్రమశిక్షణ, ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి అన్నీ ఒకే వివాదంలో కలిసిపోయాయి.

**• సురేఖ తప్పేంటి.. సుస్మిత వ్యాఖ్యలే కేంద్రబిందువు**

కొండా సురేఖ బర్తరఫ్‌కు దారితీసిన తాజా పరిణామాల కేంద్రంలో ఆమె కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలే ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి సుస్మిత తీవ్ర విమర్శలు చేయడంతో వివాదం ఒక్కసారిగా ముదిరింది. పార్టీ నాయకత్వంపై కుటుంబ సభ్యుల నుంచి వచ్చిన బహిరంగ వ్యాఖ్యలు కాంగ్రెస్ అధిష్ఠానానికి అసౌకర్యంగా మారినట్లు సమాచారం. ముఖ్యంగా ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నేతపై ఇలాంటి వ్యాఖ్యలు వచ్చినప్పుడు పార్టీ క్రమశిక్షణను కాపాడాల్సిన అవసరం ఉందని నాయకత్వం భావించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే సురేఖ మాత్రం సుస్మిత వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని మొదటి నుంచీ చెబుతున్నారు. సుస్మిత తన వ్యక్తిగత హోదాలో మాట్లాడిందని... తనను రాజకీయ పార్టీ తరఫున మాట్లాడమని ఎవరూ పంపలేదని, ఆమె వ్యాఖ్యలను తనపై మోపడం న్యాయం కాదని వాదించారు. తన కుమార్తె గౌరవం కోసం తాను ఆమె వ్యాఖ్యలపై స్పందించలేదని కూడా వివరించారు. ఇదే అంశాన్ని ఆమె హైకమాండ్‌కు రాసిన లేఖలో ప్రస్తావించినట్లు చెప్పారు. మరోవైపు పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి నాయకత్వంపై వివిధ సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారని సురేఖ ప్రశ్నించారు. జగ్గారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరుల వ్యాఖ్యలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించిన నాయకులు కూడా తర్వాత పార్టీలో కీలక స్థానాల్లో కొనసాగారని ఉదాహరణలు చూపించారు. మల్లు రవి గతంలో కాంగ్రెస్‌ను విమర్శించలేదా అని ప్రశ్నించారు. రోశయ్య, జైపాల్‌రెడ్డి వంటి సీనియర్ నాయకులు ఇందిరాగాంధీపై తీవ్ర విమర్శలు చేసిన సందర్భాలను గుర్తుచేశారు. ఇప్పుడు తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని తనపై చర్యలు తీసుకోవడం డబుల్ స్టాండర్డ్స్‌కు దర్పణమని సురేఖ ఆరోపించారు.

**• రేవంత్‌పై సురేఖ సంచలన ఆరోపణలు**

బర్తరఫ్ తర్వాత కొండా సురేఖ చేసిన అత్యంత సంచలన ఆరోపణ సీఎం రేవంత్‌రెడ్డిపైనే. హైకమాండ్‌ను రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తనను మంత్రివర్గం నుంచి తొలగించకపోతే తాను రాజీనామా చేస్తానని సీఎం హైకమాండ్‌పై ఒత్తిడి తెచ్చారని ఆమె పేర్కొన్నారు. ''ఆమెను తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా?'' అనే స్థాయిలో సీఎం ప్రశ్నించినట్లు సురేఖ ఆరోపించారు. తనను తొలగించే ఆలోచన హైకమాండ్‌కు అసలు లేదని, రేవంత్ పట్టుబట్టడం వల్లే నిర్ణయం జరిగిందని ఆమె చెప్పారు. ఈ ఆరోపణ తెలంగాణ కాంగ్రెస్‌లో మరింత రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. తనపై వ్యక్తిగత కక్షతోనే చర్యలు తీసుకున్నారని సురేఖ ఆరోపించడం ఈ వివాదాన్ని సాధారణ క్రమశిక్షణా చర్య స్థాయి నుంచి నాయకత్వ పోరాటంగా మార్చింది. తన మాజీ ఓఎస్డీ సుమంత్‌ను కూడా తనకు తెలియకుండా తప్పించారని, ఆయన కుటుంబాన్ని పోలీసుల ద్వారా ఇబ్బంది పెడుతున్నారని ఆమె ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డిపై కూడా సురేఖ తీవ్ర ఆరోపణలు చేశారు. వీరంతా కలిసి తనపై కుట్ర చేశారని ఆమె ఆరోపించారు. తన శాఖల విషయంలో తనకు పూర్తి స్వేచ్ఛ లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే కొన్ని నిర్ణయాలు తీసుకున్నారని ఆమె హైకమాండ్‌కు రాసిన లేఖల్లో పేర్కొన్నట్లు తెలిపారు. తన నియోజకవర్గ అభివృద్ధి విషయంలో వివక్ష చూపారని, తన శాఖకు సంబంధించిన వ్యవహారాల్లో ఇతర ఎమ్మెల్యేలు జోక్యం చేసుకున్నారని కూడా ఆరోపించారు. కడియం శ్రీహరి తన శాఖకు సంబంధించిన అధికారులతో సమీక్షలు నిర్వహించారని ఆమె పేర్కొన్నారు. యాదాద్రి ఆలయ కమిటీ విషయంలో కూడా తనతో సంప్రదింపులు జరగలేదని చెప్పారు.

**• హైకమాండ్ ఏం చేసింది.. చిన్నారెడ్డి ఎపిసోడ్‌తో కొత్త మలుపు**

కొండా సురేఖ వ్యవహారం ఒక్క రోజులో ముగిసిన వివాదం కాదు. తెలంగాణ కాంగ్రెస్‌లో గత కొంతకాలంగా నేతల మధ్య విభేదాలు, ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి, జిల్లాల వారీగా బయటపడుతున్న రాజకీయ గొడవలు హైకమాండ్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలోని ముఖ్య నేతలను ఢిల్లీకి పిలిపించి అధిష్ఠానం చర్చలు జరిపిన విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి తనపై వచ్చిన ఆరోపణలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు వివరించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. సురేఖ వ్యవహారాన్ని ఉపేక్షిస్తే కేడర్‌కు తప్పుడు సంకేతం వెళ్తుందని, రాష్ట్ర నాయకత్వంపై అనవసర అనుమానాలు పెరుగుతాయని సీఎం వివరించినట్లు సమాచారం. చివరికి సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించే నిర్ణయం తీసుకున్నారు. ఆమెపై చర్యతో పాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి జి.చిన్నారెడ్డిని కూడా తొలగించడం రాజకీయంగా మరింత ఆసక్తికరంగా మారింది. చిన్నారెడ్డి కూడా ప్రభుత్వ విధానం, పార్టీ అంతర్గత పరిణామాలపై చేసిన వ్యాఖ్యల కారణంగా వివాదంలోకి వచ్చారు. ఇద్దరిపై ఒకేసారి చర్యలు తీసుకోవడం ద్వారా పార్టీ క్రమశిక్షణ విషయంలో నాయకత్వం కఠినంగా ఉందనే సంకేతం వెళ్లిందని కాంగ్రెస్‌లో కొందరు భావిస్తున్నారు. మరోవైపు సురేఖ అనుచరులు మాత్రం ''అవినీతి ఆరోపణలు లేని ఇద్దరు ప్రజా నాయకులపై ఎందుకు ఇలాంటి చర్యలు?'' అని ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సురేఖకు ఉన్న రాజకీయ పట్టు, ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతంలో చిన్నారెడ్డికి ఉన్న గుర్తింపు నేపథ్యంలో ఈ నిర్ణయాలు భవిష్యత్ ఎన్నికలపై ప్రభావం చూపవచ్చనే చర్చ కూడా మొదలైంది. సురేఖ స్వయంగా తాను ప్రజాబలం ఉన్న నాయకురాలిని తనను ఎలా తొలగిస్తారని వాదిస్తున్నారు. తనకు మంత్రి పదవి కేవలం ఆభరణం మాత్రమేనని, పదవి లేకపోయినా ప్రజల్లో తన రాజకీయ బలం తగ్గదని స్పష్టం చేశారు. తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావడం సంతోషంగా ఉందని, పద్మశాలీ, మున్నూరు కాపు వర్గాలకు ప్రాతినిధ్యం దక్కడం కూడా సంతోషకరమని చెప్పారు.

**• ''కాంగ్రెస్‌ను వీడను''.. సురేఖ భవిష్యత్ వ్యూహం**

మంత్రి పదవి కోల్పోయిన వెంటనే కొండా సురేఖ కాంగ్రెస్‌ను వీడతారనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె కుటుంబం మరో రాజకీయ పార్టీలో చేరుతుందా? ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా? స్వతంత్ర రాజకీయ మార్గం ఎంచుకుంటారా? అనే ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. అయితే ఈ ఊహాగానాలకు సురేఖ స్వయంగా తెరదించారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదని, ఎమ్మెల్యేగా కొనసాగుతానని ఆమె స్పష్టం చేశారు. తన నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన ముందున్న లక్ష్యమని చెప్పారు. తనపై తీసుకున్న బర్తరఫ్ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని కూడా తాను అడగడం లేదన్నారు. అయితే పార్టీ తన పద్ధతిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయకపోవడం వల్ల కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరుగుతోందని ఆమె వ్యాఖ్యానించారు. ప్రభుత్వం క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రత్యేక సర్వే చేయించుకుంటే వాస్తవ పరిస్థితి తెలుస్తుందని సూచించారు. ''మంత్రులు, ఎమ్మెల్యేలు సంతోషంగా ఉన్నారా? గుండెలపై చేయి వేసుకుని చెప్పాలి'' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలోని అంతర్గత అసంతృప్తిపై నేరుగా దృష్టి సారించాయి. పనులు చేయించుకోవడానికి ఎవరిని కలవాలో తెలియని పరిస్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని, ప్రజా ప్రతినిధులకే పనులు జరగడం లేదనే భావన ఉందని ఆమె అన్నారు. తాము ప్రజలకు సేవ చేయలేకపోతున్నామనే బాధ చాలామందిలో ఉందని చెప్పారు. ''ఈ రోజు నాకు జరిగింది.. రేపు మీకు జరగొచ్చు'' అంటూ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆమె బహిరంగ పిలుపునిచ్చారు. బయటకు వచ్చి ధైర్యంగా తమ సమస్యలు చెప్పాలని కోరారు. అదే సమయంలో తన రాజకీయ భవిష్యత్తుపై ఎలాంటి ప్లాన్‌బి సిద్ధం చేసుకోలేదని చెప్పారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానన్న సురేఖ నిర్ణయం ప్రస్తుతానికి స్పష్టంగా కనిపిస్తున్న రాజకీయ వైఖరి. అయితే భవిష్యత్తులో పరిణామాలు ఎలా మారతాయన్నది మాత్రం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 2028 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో అంతర్గత సమీకరణాలు మారితే సురేఖ రాజకీయ స్థానం కీలకంగా మారే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

**• ఇక్కడ్నుంచి ఎక్కడకు ఈ లొల్లి?**

కొండా సురేఖ బర్తరఫ్‌తో మొదలైన ఈ రాజకీయ లొల్లి ఇప్పుడు కేవలం ఒక మంత్రి పదవి వివాదంగా మిగిలే పరిస్థితి కనిపించడం లేదు. సురేఖ ఆరోపణలు.. రేవంత్ నాయకత్వంపై ప్రశ్నలు.. సుస్మిత సవాళ్లు.. హైకమాండ్ కఠిన నిర్ణయం అన్నీ కలిసి తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు దారి తీస్తున్నాయి. సురేఖ మాత్రం కాంగ్రెస్‌ను వీడేది లేదని స్పష్టం చేస్తూ ఎమ్మెల్యేగా ప్రజల మధ్యే ఉంటానంటున్నారు. అదే సమయంలో పార్టీ తీరు మారాలని, ఎమ్మెల్యేలు, మంత్రులు తమ సమస్యలను బయటకు చెప్పాలని పిలుపునిస్తున్నారు. మరోవైపు సుస్మిత చేసిన తాజా వ్యాఖ్యలు కొండా కుటుంబం వెనక్కి తగ్గే ప్రసక్తి లేదనే సంకేతం ఇస్తున్నాయి. దీంతో ఇక్కడ్నుంచి ఎక్కడకు ఈ లొల్లి? అన్నదే అసలు ప్రశ్నగా మారింది. ఇది ఇక్కడితో ముగుస్తుందా? లేక కొండా కుటుంబం, రేవంత్ వర్గాల మధ్య మరింత రాజకీయ పోరాటానికి దారితీస్తుందా? 2028 ఎన్నికలకు ముందే ఈ విభేదాలు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలను ప్రభావితం చేస్తాయా? పార్టీ అధిష్ఠానం మధ్యవర్తిత్వంతో వివాదానికి తెరపడుతుందా? లేక మరిన్ని నేతలు బహిరంగంగా గళం విప్పుతారా? ప్రస్తుతం సమాధానాలు లేని ప్రశ్నలే ఎక్కువ. మంత్రి పదవి పోయినా సురేఖ రాజకీయంగా యాక్టివ్‌గా ఉంటానని చెబుతున్నారు. కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని ప్రకటించారు. ఇక ముందు సురేఖ కుటుంబం ఏ వ్యూహంతో ముందుకు వెళ్తుంది? కాంగ్రెస్‌లోనే ఉండి రేవంత్ నాయకత్వాన్ని ప్రశ్నిస్తుందా? పార్టీ అంతర్గతంగా మరికొందరు నేతలు ఆమెకు మద్దతుగా బయటకు వస్తారా? 2028 ఎన్నికల నాటికి ఈ విభేదాలు ఏ రూపం దాలుస్తాయి? అన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అసలు ఆసక్తికరమైన ప్రశ్న. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ ముందున్న అసలు సవాలు ఒక్కటే.. వివాదాన్ని ఆపుతుందా.. లేక ఈ లొల్లి మరింత దూరం వెళ్తుందా?

**''రేవంత్ నా తల్లి స్థానంలో పోటీ చేయాలి'':సుస్మిత సవాల్**

ఇప్పటికే సురేఖ బర్తరఫ్‌తో వేడెక్కిన తెలంగాణ రాజకీయాల్లో ఆమె కుమార్తె కొండా సుస్మిత తాజా వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి. సీఎన్ఎన్ న్యూస్18తో మాట్లాడిన సుస్మిత తన గత వ్యాఖ్యలపై స్పష్టత ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత హోదాలో చేసినవేనని, ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా చేయలేదని ఆమె చెప్పారు. తాను ఒక వ్యక్తిని ఉద్దేశించి మాత్రమే మాట్లాడానని స్పష్టం చేశారు. తన తల్లికి జరిగిన పరిణామాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని, ఆమెను ఇలా చూడటం తనను తీవ్రంగా బాధించిందని చెప్పారు. తన తల్లికి ఎప్పటికీ అండగా ఉంటానని సుస్మిత స్పష్టం చేశారు. “నా తల్లి మౌనంగా ఉండేలా ఎవరూ చేయలేరు” అంటూ తీవ్రంగా స్పందించారు. అంతటితో ఆగకుండా రేవంత్‌రెడ్డికి నేరుగా సవాల్ విసిరారు. తన తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం నుంచి రేవంత్‌రెడ్డి పోటీ చేయాలని సవాల్ చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా మరింత వేడి పెంచాయి. ఇప్పటికే సురేఖ రేవంత్‌రెడ్డిపై బ్లాక్‌మెయిల్ ఆరోపణలు చేయడం, హైకమాండ్ నిర్ణయాన్ని ప్రశ్నించడం, కాంగ్రెస్‌లోని మంత్రులు, ఎమ్మెల్యేలు ధైర్యంగా మాట్లాడాలని పిలుపునివ్వడం జరిగింది. ఇప్పుడు సుస్మిత కూడా అదే రాజకీయ పోరాటాన్ని మరింత వ్యక్తిగత స్థాయికి తీసుకెళ్లడంతో కొండా కుటుంబం రేవంత్ వర్గాల మధ్య విభేదాలు భవిష్యత్తులో ఏ దిశకు వెళ్తాయన్నది కీలకంగా మారింది. ఒకవైపు పార్టీ క్రమశిక్షణ పేరుతో నాయకత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. మరోవైపు సురేఖ తనను రాజకీయంగా బలహీనపరచే కుట్ర జరిగిందని ఆరోపిస్తున్నారు.

**• గతంలో బర్తరఫ్ వేటు పడిన మంత్రులు**

గతంలోనూ అవినీతి, పరిపాలనా వైఫల్యం, పార్టీ విభేదాలు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంత్రులు పదవులు కోల్పోయిన ఉదాహరణలు ఉన్నాయి. 1984లో ఎం. రామచంద్రరావు లంచం ఆరోపణల నేపథ్యంలో పదవి కోల్పోయారు. 2015లో తెలంగాణ తొలి ప్రభుత్వంలో డాక్టర్ తాటికొండ రాజయ్యను అవినీతి ఆరోపణలు, స్వైన్‌ఫ్లూ నియంత్రణపై వచ్చిన విమర్శల నేపథ్యంలో తొలగించారు. 2021లో ఈటల రాజేందర్ భూముల ఆరోపణల నేపథ్యంలో కేబినెట్ నుంచి బయటకు వచ్చారు. 2024లో గుమ్మనూరు జయరాం పార్టీ ఫిరాయింపు నేపథ్యంలో మంత్రివర్గం నుంచి తొలగించారు. ఇప్పుడు 2026లో కొండా సురేఖ వంతు వచ్చింది. అయితే ఈసారి ప్రత్యేకత ఏమిటంటే బర్తరఫ్ వెనుక అవినీతి ఆరోపణ కంటే పార్టీ క్రమశిక్షణ, కుటుంబ సభ్యుల వ్యాఖ్యలు, నాయకత్వంపై బహిరంగ విమర్శలు, అంతర్గత రాజకీయ విభేదాలే ప్రధాన చర్చగా మారాయి. అందుకే సురేఖ బర్తరఫ్ కథ మంత్రి పదవి పోయిన ఘటనగా మాత్రమే మిగలడం లేదు. ఇది తెలంగాణ కాంగ్రెస్‌లో నాయకత్వం, అసంతృప్తి, వ్యక్తిగత రాజకీయ బలం, భవిష్యత్ ఎన్నికల సమీకరణాలపై ప్రభావం చూపే పరిణామంగా మారింది. ప్రస్తుతం సురేఖ కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేయడం, సుస్మిత రేవంత్‌కు సవాల్ విసరడం, హైకమాండ్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే పరిస్థితి కనిపించకపోవడం.. అన్నీ కలిసి తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ అధ్యాయానికి తెరలేపాయి.





# గరం గరం విజయనగరం

## జడ్పీ పోరులో వారసుల ఎంట్రీ

**విజయనగరం జిల్లా రాజకీయాల్లో జడ్పీ పోరు కొత్త వేడి రేపుతోంది. ఎమ్మెల్యే సీటు, మంత్రి పదవి కోసం కాకుండా ఇప్పుడు జిల్లా పరిషత్ పీఠం కోసం బొత్స–కిమిడి కుటుంబాల మధ్య రాజకీయ వారసత్వ పోరు మొదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన కుమార్తె అనూషను రాజకీయంగా ముందుకు తీసుకురావాలని చూస్తున్నట్టు ప్రచారం జరుగుతుండగా.. ప్రస్తుత చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు తన రాజకీయ వారసుడు రామ్ మల్లిక్ నాయుడిని రంగంలోకి దింపే ఆలోచనలో ఉన్నట్టు చర్చ సాగుతోంది. 2019లో బొత్స 26,498 ఓట్ల మెజారిటీతో గెలిస్తే.. 2024లో కిమిడి 11,971 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇప్పుడు గుర్ల, గరివిడి, మెరకముడిదాం మండలాలపై దృష్టి పెరిగింది. జడ్పీటీసీ రిజర్వేషన్లు, కూటమి సీట్ల పంపకం, కేడర్ సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. బయటికి వారసుల పోటీగా కనిపిస్తున్నా.. తెరవెనుక బొత్స–కిమిడి ఆధిపత్య పోరే. ఇదే పోరు 2029 అసెంబ్లీ రాజకీయాలకు పునాది అవుతుందా అన్నదే అసలు ఆసక్తి.**

### జడ్పీ పోరులో బొత్స వర్సెస్ కిమిడి వారసులు

విజయనగరం జిల్లా రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. ఈసారి పోరు ఎమ్మెల్యే సీటు కోసం కాదు. మంత్రిపదవి కోసం కాదు. జిల్లా పరిషత్ పీఠం కోసం. కానీ ఆ పీఠం వెనుక ఉన్న అసలు కథ మాత్రం రాజకీయ వారసత్వం. రెండు కుటుంబాల భవిష్యత్తు. రెండు రాజకీయ శిబిరాల ప్రతిష్ఠ. ఒకే నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఢీకొంటున్న రెండు రాజకీయ శక్తులు ఇప్పుడు తమ వారసులను రంగంలోకి దింపేందుకు సిద్ధమవుతున్నాయన్న ప్రచారం జిల్లాలో కొత్త సమీకరణాలకు తెరతీస్తోంది. ఒకవైపు మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ. మరోవైపు మాజీ మంత్రి, ప్రస్తుత చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు. ఇద్దరూ రాజకీయంగా తలపడటం కొత్తేమీ కాదు. కానీ ఇప్పటివరకు పోటీ ప్రధానంగా వారి మధ్యే కనిపించింది. ఇప్పుడు ఆ పోరు ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. బొత్స తన కుమార్తె అనూషకు రాజకీయ భవిష్యత్తు నిర్మించాలని చూస్తుంటే.. కళా వెంకట్రావు తన రాజకీయ వారసుడు రామ్ మల్లిక్ నాయుడిని ముందుకు తీసుకురావాలని భావిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఇదే ఇప్పుడు విజయనగరం రాజకీయాల్లో అసలు హాట్ టాపిక్.

### చీపురుపల్లిలో మొదలైన మంట

బొత్స-కిమిడి కుటుంబాల మధ్య రాజకీయ పోరుకు చీపురుపల్లి ప్రధాన వేదిక. ఈ ఇద్దరి రాజకీయ ప్రస్థానాల ను పక్క పక్కన పెడితే.. చీపురుపల్లి నియోజకవర్గం ఓ సాధారణ నియోజకవర్గంలా కనిపించదు. ఇక్కడ గెలుపు అంటే కేవలం ఒక ఎమ్మెల్యే సీటు గెలవడం కాదు. ఉత్తరాంధ్రలో రాజకీయ ఆధిపత్యాన్ని ప్రదర్శించడం. బొత్స సత్యనారాయణకు చీపురుపల్లి చాలాకాలంగా రాజకీయ స్థావరంగా ఉంది. 2019లో ఆయన వైసీపీ తరఫున 89,262 ఓట్లు సాధించి 26,498 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అదే ఎన్నికలో టీడీపీ తరఫున కిమిడి నాగార్జునకు 62,764 ఓట్లు వచ్చాయి. అయితే 2024లో సమీకరణాలు తలకిందులయ్యాయి. కిమిడి కళా వెంకట్రావు టీడీపీ అభ్యర్థిగా 88,225 ఓట్లు సాధించి బొత్స సత్యనారాయణపై 11,971 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. బొత్సకు 76,254 ఓట్లు వచ్చాయి. అంటే ఐదేళ్లలోనే కథ పూర్తిగా మారిపోయింది. 2019లో బొత్స ఆధిపత్యం ఎంత స్పష్టంగా కనిపించిందో.. 2024లో కిమిడి పైచేయి అంతే స్పష్టంగా బయటపడింది. కానీ ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. 2024లో కిమిడి గెలిచారంటే బొత్స రాజకీయ బలం పూర్తిగా కరిగిపోయిందా సమాధానం అంత సులభం కాదు. 2024 ఫలితాన్ని కేవలం 11,971 మెజారిటీగా చదివితే రాజకీయ విశ్లేషణ సగమే అవుతుంది. ఎందుకంటే బొత్స సత్యనారాయణ ఓడిపోయినా 76 వేలకు పైగా ఓట్లు సాధించారు. అంటే ఆయన వ్యక్తిగత రాజకీయ నెట్‌వర్క్ పూర్తిగా కూలిపోలేదన్నది స్పష్టమే. మరోవైపు కిమిడి 88,225 ఓట్లతో 51 శాతానికి పైగా ఓటు వాటాను సాధించారు. ఇదే కిమిడి శిబిరానికి బలం. బొత్స శిబిరానికి హెచ్చరిక. 2019లో 26 వేలకు పైగా మెజారిటీ సాధించిన బొత్స.. ఐదేళ్ల తరువాత 11,971 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అంటే ఓటర్ల మూడ్ మారుతుంది. అధికార వ్యతిరేకత ప్రభావం చూపుతుంది. కూటమి సమీకరణాలు పనిచేస్తాయి. కానీ వ్యక్తిగత రాజకీయ బలం ఒక్క ఎన్నికతో పూర్తిగా మాయమవదు. అందుకే 2024 ఓటమిని బొత్స శిబిరం అంతిమ తీర్పుగా చూడటం లేదు. అదే సమయంలో 2024 విజయాన్ని కిమిడి వర్గం కేవలం ఒక ఎన్నికల విజయంగా కూడా చూడటం లేదు. దాన్ని చీపురుపల్లిలో రాజకీయ పునరాగమనానికి పునాది చేయాలని చూస్తోంది. ఇక్కడే వారసుల ఎంట్రీ ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

#### బొత్సకు పునరాగమనం..
### కిమిడికి వారసత్వ పరీక్ష

బొత్స సత్యనారాయణకు ఈ పోరు ఒక రకంగా రాజకీయ పునరాగమన పరీక్ష. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత తన కుటుంబ రాజకీయ వారసత్వాన్ని ముందుకు తీసుకురావడం ఎంతవరకు సాధ్యమవుతుందో చూపించాల్సిన పరిస్థితి. అనూషను కేడర్‌లోకి తీసుకెళ్లడం మాత్రమే సరిపోదు. ఆమెకు స్వతంత్రంగా రాజకీయ గుర్తింపు రావాలి. కార్యకర్తలతో సంబంధాలు ఏర్పడాలి. స్థానిక నాయకులతో సమన్వయం ఉండాలి. ముఖ్యంగా తండ్రి పేరుపై మాత్రమే ఆధారపడకుండా తనకంటూ రాజకీయ స్థలం నిర్మించుకోవాలి. అదే జరిగితే బొత్స కుటుంబానికి ఇది రెండో ఇన్నింగ్స్‌కు బలమైన ఆరంభం కావచ్చు. కిమిడి కళా వెంకట్రావుకు కూడా అంతే. 2024లో బొత్సను ఓడించడం ఒక విషయం. తన తరువాతి తరాన్ని రాజకీయంగా నిలబెట్టడం మరో విషయం. రామ్ మల్లిక్ నాయుడు జడ్పీటీసీగా గెలిచి.. జిల్లా రాజకీయాల్లో చురుగ్గా పనిచేస్తే కిమిడి కుటుంబానికి కొత్త తరం నాయకత్వం సిద్ధమవుతుంది. అయితే రాజకీయ వారసత్వం కేవలం కుటుంబ పేరు వల్ల నిలబడదు. గెలుపు రావాలి. కేడర్ అంగీకారం ఉండాలి. ప్రజల్లో వ్యక్తిగత ఇమేజ్ పెరగాలి. లేకపోతే ప్రత్యర్థులు ఒకే మాట అంటారు.“తండ్రి పేరు ఉంది.. కానీ కొడుకుకు సొంత బలం ఎంత?” అదే పరీక్ష రామ్ మల్లిక్ నాయుడికి ఎదురుకానుంది.

### బొత్స లెక్క ఏమిటి? కిమిడి వ్యూహమేంటి?

బొత్స సత్యనారాయణ రాజకీయంగా బలమైన సంస్థాగత నెట్‌వర్క్ కలిగిన నాయకుడనే పేరుంది. పార్టీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా తన అనుచరులతో సంబంధాలు కొనసాగించగల సామర్థ్యం ఆయనకు ఉందన్నది ఆయన రాజకీయ ప్రయాణాన్ని గమనించిన వారి అభిప్రాయం. అయితే ఇప్పుడు ఆయన ముందున్న సవాలు వేరు. తన తరువాత తన రాజకీయ శక్తిని ఎవరు మోస్తారు? అందుకే కుమార్తె అనూషను రాజకీయంగా యాక్టివ్ చేయాలనే ఆలోచనకు ప్రాధాన్యం పెరిగినట్టు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలోని పార్టీ కార్యక్రమాల్లో కనిపించడం, కార్యకర్తలను కలవడం, నాయకులతో సమన్వయం చేసుకోవడం.. ఇవన్నీ యాదృచ్ఛిక పరిణామాలా? లేక పెద్ద రాజకీయ ప్రణాళికలో భాగమా? అన్న చర్చ వైసీపీ వర్గాల్లో జరుగుతోంది. ఒక విషయం మాత్రం స్పష్టం. వారసుడిని ఒక్కసారిగా ఎన్నికల ముందు ప్రజల ముందుకు తీసుకురావడం కంటే.. ముందుగానే కేడర్‌తో పరిచయం చేయడం రాజకీయంగా సురక్షితమైన వ్యూహం. అనూషకు అదే ప్లాన్ అమలు చేస్తున్నారా అన్నదే ఇప్పుడు ఆసక్తికరం. ఇక కిమిడి కళా వెంకట్రావు వైపు చూస్తే.. ఆయనకూ దాదాపు ఇదే ఆలోచన ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ. కళా వెంకట్రావు ప్రస్తుతానికి చీపురుపల్లి ఎమ్మెల్యే. 2024లో బొత్స లాంటి సీనియర్ నాయకుడిని ఓడించడం ఆయనకు రాజకీయంగా పెద్ద బలం. ఆ విజయాన్ని ఇప్పుడు కుటుంబ రాజకీయ భవిష్యత్తుకు ఉపయోగించుకోవాలనే ఆలోచన ఉంటే ఆశ్చర్యం లేదు. రామ్ మల్లిక్ నాయుడిని జిల్లా రాజకీయాల్లో స్థిరపరచాలంటే స్థానిక సంస్థల ఎన్నికలు మంచి వేదిక. అసెంబ్లీ ఎన్నికతో పోలిస్తే జడ్పీటీసీ ఎన్నిక స్థానిక కేడర్, మండల స్థాయి సంబంధాలు, వ్యక్తిగత పరిచయాలు, కుటుంబ ప్రభావం వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంటుంది. అందుకే చీపురుపల్లి నియోజకవర్గంలోని మండలాలను ముందుగానే పరిశీలించడం.. రిజర్వేషన్ ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడి నుంచి పోటీ చేయడం.. కేడర్‌ను సమీకరించడం.. ఇవన్నీ పెద్ద రాజకీయ ప్రయోగానికి ముందస్తు ఏర్పాట్లుగా చూడొచ్చు.

### 15 ఏళ్ల ఆధిపత్యానికి సవాల్?

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి బయటికి చూస్తే స్థానిక సంస్థల పదవే. కానీ ఉత్తరాంధ్ర రాజకీయాల్లో దానికి ఉన్న ప్రాధాన్యం తక్కువ కాదు. ఎందుకంటే జడ్పీ వ్యవస్థ అంటే గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించిన రాజకీయ నెట్‌వర్క్. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలు ఐదేళ్లకొకసారి వస్తాయి. కానీ మండలాలు, గ్రామాలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో ఏర్పడే స్థానిక రాజకీయ వ్యవస్థ రోజువారీ రాజకీయ సంబంధాలను నిర్మిస్తుంది. అందుకే జడ్పీ చైర్‌పర్సన్ పీఠాన్ని ఎవరు దక్కించుకున్నా.. వారి కుటుంబానికి జిల్లాలో ఒక ప్రత్యేక రాజకీయ స్థానం ఏర్పడుతుంది. ఇదే కారణంగా కూటమిలోనూ జడ్పీ పదవిపై లెక్కలు మొదలైనట్టు ప్రచారం. విజయనగరం మేయర్ పదవి టీడీపీకి వెళితే జడ్పీ పీఠాన్ని జనసేన కోరుతోందన్న చర్చ కూడా కూటమి వర్గాల్లో వినిపిస్తోంది. ఇది నిజంగా సీట్ల సర్దుబాటు రూపం దాల్చుతుందా? లేక ఎన్నికల సమయానికి మరో సమీకరణ వస్తుందా? ఇప్పుడే చెప్పలేం. కానీ పదవి చుట్టూ పోటీ మాత్రం మొదలైందన్నది రాజకీయ సంకేతం. బొత్స కుటుంబం జడ్పీ పీఠంపై దీర్ఘకాలంగా ప్రభావం చూపిందన్న ప్రచారం ఉంది. అదే ఆధిపత్యాన్ని కొనసాగించాలన్నది బొత్స శిబిరం లక్ష్యంగా కనిపిస్తోంది. అలా అయితే ఈ ఎన్నిక కేవలం బొత్స వర్సెస్ కిమిడి కాదు. పాత ఆధిపత్యం వర్సెస్ కొత్త ఆధిపత్యం. అనుభవం వర్సెస్ అధికార బలం. పాత కేడర్ నెట్‌వర్క్ వర్సెస్ కొత్త రాజకీయ సమీకరణాలు. ఇదే ఈ పోరును ఆసక్తికరంగా మారుస్తోంది. చీపురుపల్లి నియోజకవర్గంలోని గుర్ల, గరివిడి, మెరకముడిదాం మండలాలు ఇప్పుడు ప్రత్యేక రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. జడ్పీటీసీ రిజర్వేషన్ ఏ మండలానికి అనుకూలంగా వస్తుందన్నదే మొదటి ప్రశ్న. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే వారసులను అక్కడి నుంచి రంగంలోకి దింపాలన్న ఆలోచన రెండు శిబిరాల్లోనూ ఉంటే.. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే అక్కడ రాజకీయ కదలికలు పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ మరో చిక్కు కూడా ఉంది. ఒకే మండలంపై రెండు కుటుంబాలు కన్నేస్తే? అప్పుడు అది సాధారణ జడ్పీటీసీ ఎన్నిక కాదు. చీపురుపల్లి అసెంబ్లీ పోరుకు రిహార్సల్‌గా మారుతుంది.

### బొత్స బలం ఎక్కడ? కిమిడి బలం ఎక్కడ?

బొత్సకు ప్రధాన బలం ఆయన రాజకీయ అనుభవం. దీర్ఘకాలంగా నియోజకవర్గంలో ఏర్పడిన వ్యక్తిగత సంబంధాలు. పార్టీ కేడర్‌తో ఉన్న అనుబంధం. అధికారంలో ఉన్న సమయంలో ఏర్పడిన పరిపాలనా పరిచయాలు. ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఉన్న విస్తృత పరిచయాలు. అయితే బలహీనత కూడా ఉంది. 2024లో వచ్చిన ఓటమి. ఒకప్పుడు తనకు బలమైన చీపురుపల్లిలో ప్రత్యర్థి చేతిలో ఓడిపోవడం బొత్స శిబిరానికి రాజకీయంగా పెద్ద హెచ్చరిక. అంతేకాదు, అధికారంలో లేని పార్టీగా వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంతమేరకు కేడర్‌ను సమీకరించగలదన్నది కూడా కీలకం. కానీ 76 వేలకుపైగా ఓట్లు సాధించిన నాయకుడిని రాజకీయంగా ముగిసిపోయిన వ్యక్తిగా చూడటం మాత్రం పొరపాటు. కిమిడి కళా వెంకట్రావుకు ఇప్పుడు అతి పెద్ద బలం అధికార కూటమి. 2024లో బొత్సపై విజయం ఆయనకు వ్యక్తిగతంగా రాజకీయ ధైర్యాన్ని ఇచ్చింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటం స్థానిక సంస్థల ఎన్నికల్లో కేడర్‌ను సమీకరించేందుకు అదనపు బలంగా మారవచ్చు. అదీగాక ఎమ్మెల్యేగా ఉన్నందున నియోజకవర్గ రాజకీయాల్లో ఆయనకు సహజమైన ఆధిక్యం ఉంటుంది. కానీ ఇక్కడే మరో ప్రమాదం ఉంది. అధికారంలో ఉన్న నాయకుడికి ఓటర్లు ఇచ్చే మద్దతు ఎప్పుడూ శాశ్వతం కాదు. 2024లో బొత్సను ఓడించిన ఓటర్లే.. పరిస్థితులు మారితే మరో తీర్పు ఇవ్వవచ్చు. కాబట్టి కిమిడి 2024 విజయాన్ని ఆధారంగా చేసుకుని అతి విశ్వాసానికి వెళ్లకుండా స్థానిక స్థాయిలో సంస్థాగత బలం పెంచుకోవాల్సి ఉంటుంది. బయటికి చూస్తే పోటీ అనూష-రామ్ మల్లిక్ నాయుడు మధ్య. కానీ తెర వెనుక పోరు మాత్రం బొత్స-కిమిడి మధ్యే. ఎందుకంటే వారసుడు గెలిస్తే అది వ్యక్తిగత విజయం కాదు. తండ్రి రాజకీయ పునాది బలంగా ఉందన్న సంకేతం. అనూష గెలిస్తే బొత్స కుటుంబం తన రాజకీయ ప్రభావాన్ని తిరిగి నిలబెట్టుకుంటోందనే సందేశం వెళుతుంది. రామ్ మల్లిక్ నాయుడు గెలిస్తే.. 2024 అసెంబ్లీ విజయానికి కొనసాగింపుగా కిమిడి కుటుంబం చీపురుపల్లి-విజయనగరం రాజకీయాల్లో కొత్త తరాన్ని స్థిరపరుస్తోందనే సంకేతం వెళుతుంది. అందుకే ఈ ఎన్నికలో ఒక్క జడ్పీటీసీ సీటు కూడా చిన్నది కాదు.

### ఇద్దరి లక్ష్యం ఒక్కటే... అసలు యుద్ధం 2029 కోసమేనా?

ఇదే ఈ కథలో అత్యంత కీలకమైన అంశం. ఇప్పుడే వారసులను రంగంలోకి దింపడం వెనుక 2029 అసెంబ్లీ ఎన్నికల లెక్కలు ఉండవచ్చన్నది రాజకీయ పరిశీలకుల అంచనా. జడ్పీటీసీగా గెలిచి మండల స్థాయిలో పట్టు సాధించిన నాయకుడు.. రాబోయే సంవత్సరాల్లో నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుంది. అంటే జడ్పీ పీఠం లక్ష్యం మాత్రమే కాదు. 2029 రాజకీయాలకు పునాది వేయడమే అసలు లక్ష్యం కావచ్చు. బొత్స కుటుంబం తన రాజకీయ పునాదిని నిలబెట్టుకోవాలనుకుంటోంది. కిమిడి కుటుంబం తన విజయాన్ని శాశ్వత రాజకీయ ఆధిపత్యంగా మార్చుకోవాలనుకుంటోంది. తమ తర్వాత కూడా తమ కుటుంబం పేరు చీపురుపల్లి-విజయనగరం రాజకీయాల్లో వినిపించాలి. చివరికి ఎవరి వారసత్వం నిలుస్తుంది? ఇదే ఇప్పుడు విజయనగరం ముందున్న అసలు ప్రశ్న. బొత్సకు రాజకీయ అనుభవం ఉంది. బలమైన పాత నెట్‌వర్క్ ఉంది. కానీ 2024 ఓటమి ఉంది. కిమిడికి అధికార బలం ఉంది. 2024 విజయంతో వచ్చిన రాజకీయ ఉత్సాహం ఉంది. కానీ ఆ విజయాన్ని స్థానిక సంస్థల స్థాయిలో శాశ్వతంగా మార్చుకోవాల్సిన బాధ్యత ఉంది. బొత్స శిబిరం “పాత పునాది ఇంకా బలంగానే ఉంది” అని నిరూపించుకోవాలి. కిమిడి శిబిరం “ఇక పాత రాజకీయ సమీకరణాలు లేవు.. కొత్త శక్తి వచ్చేసింది” అని నిరూపించుకోవాలి. మధ్యలో అనూష. మరోవైపు రామ్ మల్లిక్ నాయుడు. ఒకరు బొత్స రాజకీయ వారసత్వానికి ప్రతినిధి. మరొకరు కిమిడి రాజకీయ వారసత్వానికి ప్రతినిధి. అందుకే విజయనగరం జడ్పీ పోరు ఈసారి పీఠం కోసం మాత్రమే కాదు. రాజకీయ వారసత్వం ఎవరిది? చీపురుపల్లిలో రేపటి నాయకత్వం ఎవరిది? ఉత్తరాంధ్రలో తమ కుటుంబ రాజకీయ ముద్రను ఎవరు నిలబెట్టుకుంటారు? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పే పోరుగా మారే అవకాశం ఉంది. 2024లో చీపురుపల్లి అసెంబ్లీ ఫలితం కిమిడి కళా వెంకట్రావుకు 11,971 ఓట్ల విజయాన్ని ఇచ్చింది. 2019లో అదే నియోజకవర్గం బొత్సకు 26,498 ఓట్ల మెజారిటీ ఇచ్చింది. అంటే చీపురుపల్లి ఓటరు ఒకసారి ఒక కుటుంబానికి.. మరోసారి మరో కుటుంబానికి అవకాశం ఇచ్చాడు. ఇప్పుడు అదే ఓటరు ముందు మరో పరీక్ష. తండ్రుల పోరు ముగియకముందే.. కొడుకులు, కూతుళ్ల రాజకీయ భవిష్యత్తు కోసం రంగం సిద్ధమవుతోంది. విజయనగరం రాజకీయాల్లో అందుకే మళ్లీ గరం గరం. జడ్పీ పీఠం ఎవరిది అన్నది ఎన్నిక చెబుతుంది. కానీ ఆ పీఠం కోసం ఎవరి వారసత్వం నిలబడుతుందన్నది మాత్రం ఇప్పటి నుంచే జిల్లా రాజకీయాలను వేడెక్కిస్తోంది.



### విజయనగరంలో మళ్లీ వేడి పెరగనుందా?

ఇక మరో కీలక అంశం కూటమి రాజకీయాలు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి అధికారంలో ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల పంపకం ఎలా జరుగుతుందన్నది అత్యంత కీలకం. జడ్పీ పీఠాన్ని జనసేన కోరితే టీడీపీ ఎలా స్పందిస్తుంది? టీడీపీ తన బలమైన స్థానిక నాయకత్వాన్ని పక్కనపెట్టి భాగస్వామ్య పార్టీకి పీఠాన్ని ఇస్తుందా? లేక ఎన్నికల ఫలితాల ఆధారంగా తర్వాత నిర్ణయం తీసుకుంటుందా? ఇవి ఇప్పుడే తేలని ప్రశ్నలు. కానీ ఒక విషయం మాత్రం ఖాయం. బొత్స-కిమిడి పోరుకు ఇప్పుడు మూడో కోణం కూడా చేరింది. అదే కూటమి అంతర్గత సమీకరణం. విజయనగరం రాజకీయాల్లో కుటుంబాలు కొత్త కాదు. కానీ ఒకే కుటుంబానికి చెందిన తదుపరి తరం రాజకీయ రంగంలోకి రావడం మాత్రం పోరును మరో స్థాయికి తీసుకెళ్తుంది. ఒకవైపు బొత్స కుటుంబం తన గత ఆధిపత్యాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తోంది. మరోవైపు కిమిడి కుటుంబం 2024లో వచ్చిన రాజకీయ విజయాన్ని తదుపరి తరానికి బదిలీ చేయాలని చూస్తోంది. మధ్యలో కూటమి సీట్ల సర్దుబాటు. చుట్టూ రిజర్వేషన్ల లెక్కలు. కింద కేడర్ సమీకరణాలు. పైగా 2029 అసెంబ్లీ ఎన్నికల ముందస్తు రాజకీయ వ్యూహాలు. అందుకే జడ్పీ ఎన్నికను కేవలం స్థానిక సంస్థల ఎన్నికగా చూడటానికి వీల్లేదు.

# మిథాలీ రికార్డును బ్రేక్ చేసిన స్మృతి!

## మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర



దుబాయ్ వేదికగా జరిగిన మహిళల ఆసియా కప్ మ్యాచ్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో 113 పరుగుల వద్ద రుచితా వెంకటేశ్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదిన మంధాన.. మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా మిథాలీ రాజ్ 10,868 పరుగుల రికార్డును అధిగమించింది. చివరకు 124 పరుగులతో ఔటైన ఆమె మహిళల టీ20 ఆసియా కప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో ఏడు సిక్సర్లు, 14 ఫోర్లు ఉన్నాయి. ఇదే సమయంలో టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో రెండు సెంచరీలు చేసిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచింది.

# రోహిత్ భవితవ్యంపై బీసీసీఐ స్పష్టత!

## 2027 వరల్డ్‌కప్‌కు సీనియర్ స్టార్ సేఫ్



ముంబైలో గురువారం జరిగిన కీలక బీసీసీఐ సమీక్షా సమావేశంలో రోహిత్ శర్మ వన్డే భవితవ్యంపై స్పష్టత వచ్చింది. అతడి ఫామ్ అద్భుతంగా ఉందని, జట్టులో స్థానంపై ఎలాంటి సందేహం లేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. ఇటీవలి మ్యాచ్‌లో రోహిత్ 138148 పరుగులు సాధించాడని, అలాంటప్పుడు అతడి భవిష్యత్తుపై ఊహాగానాలు ఎందుకని ప్రశ్నించారు. సమావేశానికి టీ20 కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, టెస్టువన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్, వీవీఎస్ లక్ష్మణ్‌తో పాటు బీసీసీఐ ఉన్నతాధికారులు హాజరయ్యారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మాత్రం నగరంలో లేకపోవడంతో సమావేశానికి హాజరుకాలేకపోయారు. ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల్లో ఎదురైన పరాజయాలపై సమీక్షతో పాటు 2027 వన్డే ప్రపంచకప్ కోసం వచ్చే ఏడాది కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. శ్రీలంకలో టెస్టు సిరీస్ విజయాన్ని కూడా సమీక్షించారు. ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల వైఫల్యాలకు కారణాలు విశ్లేషించి, భవిష్యత్ సీనా పర్యటనలకు వ్యూహాలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. అగార్కర్ పదవీకాలం, సెలక్షన్ కమిటీలో మార్పులు, క్రికెట్ డైరెక్టర్ నియామకంపై ఎలాంటి చర్చ జరగలేదని సైకియా తేల్చిచెప్పారు. రాబోయే సిరీస్‌లకు జట్టు ఎంపికను సెలెక్టర్లు నిర్ణయిస్తారని తెలిపారు.

# అగార్కర్ పదవిపై బీసీసీఐ వివరణ!

## సమావేశానికి దూరమైన చీఫ్ సెలెక్టర్



భారత క్రికెట్‌లో కీలక పరిణామాలు, అజిత్ అగార్కర్ పదవీకాలంపై ఊహాగానాల మధ్య బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. గురువారం జరిగిన కీలక సమావేశానికి కెప్టెన్లు శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్, కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ ఉన్నతాధికారులు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ హాజరయ్యారు. అయితే చీఫ్ సెలెక్టర్ అగార్కర్ ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లోనూ పాల్గొనలేదు. దీంతో ఆయన పదవీకాలంపై రూమర్లు మొదలయ్యాయి. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వాటిని కొట్టిపారేశారు. అగార్కర్ నగరంలో లేరని, సమావేశం తక్కువ వ్యవధిలో ఖరారైందని, ఆన్‌లైన్‌లో పాల్గొనలేని ప్రాంతంలో ఉన్నారని చెప్పారు. ఆయన పదవీకాలం పొడిగింపుపై సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదన్నారు. లక్ష్మణ్‌ను బీసీసీఐ క్రికెట్ డైరెక్టర్‌గా నియమిస్తారన్న ప్రచారాన్ని కూడా ఖండించారు. ఇదిలా ఉంటే అగార్కర్ తన పదవిలో సూర్యకుమార్ యాదవ్‌ను టీ20 కెప్టెన్‌గా కొనసాగించడం, రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించడం వంటి కీలక నిర్ణయాలకు బాధ్యత వహించారు. విమర్శలు ఎదురైనా వెనక్కి తగ్గకుండా నిర్ణయాలను సమర్థించారు.

# క్రికెట్ డైరెక్టర్‌పై బీసీసీఐ క్లారిటీ!

## గంభీర్, అగార్కర్‌పై రూమర్లకు చెక్



భారత క్రికెట్‌లో 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' నియామకం, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ముగింపు, సెలక్షన్ కమిటీలో మార్పులపై వస్తున్న ప్రచారాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా కొట్టిపారేశారు. గురువారం ముంబైలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ అంశాలపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. వీవీఎస్ లక్ష్మణ్‌ను క్రికెట్ డైరెక్టర్‌గా నియమిస్తారన్న వార్తల్లోనూ వాస్తవం లేదన్నారు. సమావేశానికి శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్, గౌతమ్ గంభీర్, లక్ష్మణ్‌తో పాటు బీసీసీఐ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అగార్కర్ నగరంలో లేకపోవడంతో సమావేశంలో పాల్గొనలేకపోయారు. జట్టు ఎంపిక, ఆటగాళ్ల కాంబినేషన్, ఏ ఫార్మాట్‌లో ఎవరు ఆడాలన్న అంశాలపై కూడా చర్చ జరగలేదని సైకియా తెలిపారు. రాబోయే వెస్టిండీస్, న్యూజిలాండ్ సిరీస్‌లకు జట్టును సెలెక్టర్లు నిర్ణయిస్తారని చెప్పారు. సమావేశంలో ప్రధానంగా ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనల్లో ఎదురైన పరాజయాలు, శ్రీలంక టెస్టు సిరీస్, 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాలపై చర్చ జరిగింది. వచ్చే ఏడాది కోసం ప్రత్యేక రోడ్‌మ్యాప్ సిద్ధం చేశామని, విదేశీ పర్యటనల్లో మెరుగైన ప్రదర్శనకు వ్యూహాలు రూపొందించామని సైకియా వెల్లడించారు. రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై కూడా బీసీసీఐ స్పష్టత ఇచ్చి, అతడి ఫామ్ అద్భుతంగా ఉందని తెలిపింది.

# పఠాన్ ట్వీట్లపై వసీం అక్రమ్ కామెంట్!

## పాక్ పోస్టులపై స్టార్ పేసర్ అసంతృప్తి



పాకిస్థాన్ దిగ్గజ బౌలర్ వసీం అక్రమ్.. మాజీ భారత ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2004లో ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా తొలిసారి పఠాన్‌ను కలిశానని, అప్పటికే అతడు తన బౌలింగ్ యాక్షన్‌ను అనుకరించేవాడని అక్రమ్ గుర్తుచేసుకున్నాడు. పఠాన్‌కు అప్పట్లో బౌలింగ్ టెక్నిక్, మైండ్‌సెట్ పై కొన్ని సూచనలు ఇచ్చానని, అతడు కెరీర్ ఆరంభంలోనే అద్భుతంగా రాణించాడని చెప్పాడు. పఠాన్ మంచి వ్యక్తి, ఇప్పటికీ తనను కలుస్తుంటాడని ప్రశంసించిన అక్రమ్.. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా అతడు తరచూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తుంటాడని వ్యాఖ్యానించాడు. అయితే పాకిస్థాన్ అభిమానులు కూడా వాటికి వెంటనే స్పందిస్తుంటారని చెప్పాడు. భారత్ పాకిస్థాన్ క్రికెట్ పోరుపైనా అక్రమ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇది కేవలం ఆట మాత్రమేనని, ఎవరో ఒకరు గెలుస్తారు, మరొకరు ఓడిపోతారని అభిమానులు అర్థం చేసుకోవాలని సూచించాడు. గత మ్యాచ్‌లకు ప్రతీకారం, పాత విషయాలను పదేపదే గుర్తుచేసుకోవడం సరికాదని, మ్యాచ్ ముగిసిన తర్వాత ముందుకు సాగాలని హితవు పలికాడు.



# టాక్సిక్ ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్..

రాకింగ్ స్టార్ యష్ నటించిన టాక్సిక్ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద జర్నీని కొనసాగిస్తున్నది. ఈ చిత్రం కన్నడ, హిందీ భాషల్లో భారీ వసూళ్లను సాధిస్తున్నది. అయితే గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను తొలుత కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ చేశారు. అయితే ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేయకుండా నిర్ణయం తీసుకొన్నారు. అయితే దాదాపు రెండో వారంలో ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేసేందుకు సిద్దమయ్యారు. భారతీయ సినిమా రంగంలో అగ్రతారలు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్ నటించిన ఈ సినిమాను దక్షిణాదిలో అగ్ర సినీ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ కే నిర్మించారు. ఈ సినిమాను ఆగస్టు 26వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేశారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్‌ను వాయిదా వేశారు. టాక్సిక్ విషయానికి వస్తే.. ఈ సినిమాను ఒరిజినల్‌గా కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో షూట్ చేశారు. దానిని తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లోకి డబ్ చేసి విడుదల చేశారు. అయితే ఇంగ్లీష్ భాషలో రూపొందించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో రిలీజ్ వాయిదా పడిందని చిత్ర యూనిట్ వెల్లడించింది. అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను సెప్టెంబర్ 4వ తేదీన రిలీజ్ చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. పరిమితమైన లోకేషన్లు అంటే.. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కొచ్చి, తిరువనంతపురం, ఇతర ప్రాంతాల్లో రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌కు రీ సెన్సార్ చేసినట్టు తెలిసింది. వాస్తవానికి ఈ సినిమా ఇండియన్ లాంగ్వేజ్ రన్‌టైమ్ విషయానికి వస్తే.. ఈ చిత్రం నిడివి 3 గంటల 14 నిమిషాలు. అంటే.. 194 నిమిషాల రన్‌టైమ్‌తో రిలీజ్ చేశారు. కానీ ఇంగ్లీష్ వెర్షన్ విషయానికి వస్తే.. భారీగా కోత పెట్టారు. ఇంగ్లీష్ వెర్షన్‌లో 17 నిమిషాల సన్నివేశాలను తొలగించారు. అంటే ఫైనల్ కట్ 2 గంటల 57 నిమిషాలు అంటే.. 177 నిమిషాల రన్‌టైమ్‌తో విడుదల చేస్తున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. ఇదిలా ఉండగా, భారతీయ భాషల్లో రిలీజైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 300 కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. ఇండియాలో 280 కోట్లకుపైగా గ్రాస్, 235 కోట్ల రూపాయల నెట్ వసూళ్లను సాధించింది. ఓవర్సీస్‌లో 42 కోట్ల రూపాయలు వసూలు చేసింది అని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే.. ఇంకా భారీగా వందల కోట్లు రాబట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.



# మాస్ స్టెప్పులతో అదరగొట్టిన శ్రీముఖి



సోషల్ మీడియాను ప్రస్తుతం ఓ ఊపు ఊపేస్తున్న తెలంగాణ జానపదం 'యేషనాగుల కట్టమీద'. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ' సినిమాలో ఈ పాటను కొత్తగా రీమిక్స్ చేయడంతో దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతీ ఒక్కరూ ఈ పాట బీట్‌కు స్టెప్పులేస్తూ రీల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ ట్రెండింగ్‌లో స్టార్ యాంకర్ శ్రీముఖి కూడా చేరిపోయారు. తనదైన స్టైల్లో మాస్ స్టెప్పులేసి సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. జిమ్‌లో వర్కవుట్ల మధ్య 'యేషనాగుల కట్టమీద' పాటకు శ్రీముఖి ఎంతో ఎనర్జీతో డ్యాన్స్ చేశారు. వైట్ టీషర్ట్, బ్లూ మినీ షార్ట్స్‌లో కనిపించిన ఆమె, పాటలోని మాస్ బీట్‌కు తగ్గట్టుగా అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకున్నారు. 'సెప్టెంబర్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో ఈ డ్యాన్స్ వీడియోను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. శ్రీముఖి డ్యాన్స్ చూసిన నెటిజన్లు ఆమె ఎనర్జీకి ఫిదా అవుతున్నారు. 'బుల్లితెర రాములమ్మ అదరగొట్టేసింది', 'మాస్ స్టెప్పులతో ఇరగదీశారు', 'మీ ఎనర్జీ లెవల్స్ వేరే లెవల' అంటూ కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు. పాటలోని ఊపుకు శ్రీముఖి పెర్ఫార్మెన్స్ సరిగ్గా సరిపోయిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొన్నేళ్ల నాటి ఈ జానపద గీతాన్ని 'ది ప్యారడైజ' చిత్ర బృందం అద్భుతంగా తెరకెక్కించింది. తెలంగాణ జానపద సాహిత్యంలోని కమ్మదనం, దుమ్మురేపే మాస్ బీట్‌కు నాని, కీర్తి సురేశ్ ఎనర్జిటిక్ స్టెప్పులు తోడవడంతో యూట్యూబ్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాట ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ప్రస్తుతం శ్రీముఖి బుల్లితెరపై టాప్ యాంకర్‌గా బిజీగా ఉన్నారు. 'ఆదివారం విత్ స్టార్ మా పరివారం', 'బిగ్ బాస్ అగ్ని పరీక్ష' వంటి విజయవంతమైన షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమా ఈవెంట్లు, అప్పుడప్పుడు సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు.



# దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ సీక్వెల్

మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'లక్కీ భాస్కర' . ఓ సాధారణ బ్యాంక్ ఉద్యోగి మనీ లాండరింగ్, హవాలా ద్వారా ఎలా కోటీశ్వరుడిగా మారారు? తనను స్కామ్‌లో ఇరికించాలనుకున్న వారినే ఎలా ఇరికించి దేశం దాటేశారు? అనేదే ప్రధానాంశంగా సినిమా రూపొందించారు. ఈ మూవీ క్లైమాక్స్‌లోనే సీక్వెల్ ఉంటుందనే హింట్ ఇచ్చారు. త్వరలోనే లక్కీ భాస్కర్ సీక్వెల్ ఉంటుందని క్లారిటీ ఇచ్చారు డైరెక్టర్ వెంకీ అట్లూరి. 'చాలా మంది లక్కీభాస్కర్ 2 ఎప్పుడు అని అడుగుతున్నారు. సీక్వెల్ మరింత పవర్ ఫుల్ స్టోరీతో రాబోతోంది.' అని చెప్పారు. దుల్కర్ సల్మాన్ సైతం లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం తాను కూడా వెయిట్ చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు తాను ఏ మూవీ ఈవెంట్స్‌కు వటటల్లినా లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం వెళ్లానని... ప్రతీ ఒక్కరికీ ఆ స్టోరీ బాగా కనెక్ట్ అయ్యిందని తెలిపారు. ఫస్ట్ పార్ట్‌లో 100 కోట్ల స్కామ్‌కు పాల్పడిన వ్యక్తిగా హర్షద్ మెహతా రోల్‌ను ఇంట్రడ్యూస్ చేశారు. ఫేక్ బీఆర్స్‌తో బ్యాంక్ నగదును స్టాక్ మార్కెట్ లో ఇన్వెస్ట్ చేసి భారీ కుంభకోణానికి పాల్పడిన తీరును చూపించారు. అయితే, ఆయన ఎవరు అనేది రివీల్ చేయలేదు. సీక్వెల్‌లో హర్షద్ మెహతా బ్యాగ్రౌండ్‌తో పాటు సీబీఐ ఎంక్వైరీ, భారీ స్కామ్ నుంచి తప్పించుకున్న లక్కీ భాస్కర్ మళ్లీ ఇండియాకి తిరిగివచ్చాడా? ఆ తర్వాత ఏం జరిగింది? అనేదే చూపించనున్నట్లు అర్థమవుతోంది. ఫస్ట్ పార్ట్ క్లైమాక్స్‌లో సూపర్ హింట్ ఇస్తూనే సీక్వెల్ స్టోరీపైనా క్లారిటీ ఇచ్చారు. ఫస్ట్ పార్ట్‌లో దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించారు. సాయి కుమార్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ అందించారు. సీక్వెల్‌లో మరిన్ని రోల్స్ యాడ్ కానున్నట్లు సమాచారం.

# రోమాంచకంపై మహేశ్ బాబు కామెంట్




యువ హీరో సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ జంటగా నటించిన లెటెస్ట్ మూవీ 'రోమాంచకం'. వేణు గోపాల్ రెడ్డి రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పకుడిగా వ్యవహరించారు. ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన ఈ మూవీపై అనౌన్స్‌మెంట్ నుంచే యూత్‌లో ఆసక్తి ఏర్పడింది. ఇప్పటికే ప్రీమియర్స్ తర్వాత సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వస్తుండగా.. సూపర్ స్టార్ మహేశ్ బాబు చేసిన ఓ పోస్టు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'రోమాంచకం' చూసిన అనంతరం మహేశ్ బాబు తన సోషల్ మీడియా ఖాతాలో స్పందించారు. సినిమా చాలా ఎంటర్టైనింగ్‌గా, ప్రామిసింగ్‌గా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, నిర్మాత ప్రణయ్ రెడ్డి వంగా సహా మూవీ టీం మొత్తానికి మహేశ్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్ట్‌లో టీమ్ పెట్టిన ప్రేమ, ప్యాషన్, హార్డ్ వర్క్ స్పష్టంగా కనిపిస్తున్నాయని మహేశ్ ప్రశంసించారు. ఇంత కష్టపడి రూపొందించిన సినిమాకు తగిన ఫలితం తిరిగి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఒక యంగ్ టీమ్ చేసిన ప్రయత్నాన్ని సూపర్ స్టార్ ఈ స్థాయిలో ప్రశంసించడం సినిమాకు మంచి బూస్ట్‌గా మారింది. మహేశ్ బాబు చేసిన ఈ పోస్టుకు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా స్పందించారు. తమ సినిమాను ప్రశంసిస్తూ, చిత్రబృందాన్ని ప్రోత్సహించినందుకు మహేశ్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. దీంతో వీరిద్దరి మధ్య జరిగిన ఈ సోషల్ మీడియా సంభాషణ కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. సుమంత్ ప్రభాస్, అనంతిక జంటగా నటించిన ఈ సినిమా రొమాంటిక్, కామెడీ అంశాలతో తెరకెక్కింది. సుమంత్ ప్రభాస్‌కు 'మేమ్ ఫేమస' తర్వాత ఇది మరో కీలక చిత్రం కాగా.. అనంతిక ఇప్పటికే తన నటనతో ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకుంది. వేణు గోపాల్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు వాసుకి వైభవ్ సంగీతం అందించారు. ఇక సినిమాలో ఉపేంద్ర లిమయే, వెంకటేశ్ కాకుమాను, నరేంద్ర రవి, మణి ఏగుర్ల, సాయి సోహన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాపై మొదటి నుంచీ ఆసక్తిని పెంచాయి. ఈ సినిమాపై మహేష్ బాబు'ఎంటర్టైనింగ్ అండ్ ప్రామిసింగ' అనే పాజిటివ్ కామెంట్ మూవీ మేకర్స్ కి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రశంసించిన 'రోమాంచకం' థియేటర్లలో ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో, సుమంత్ ప్రభాస్‌అనంతిక జోడీ ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.